Follow: @ANNTELUGU

31-12-2024

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 30 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అన్ని కార్యక్రమాల్లో ప్రభుత్వ భాగస్వామిగా ఉంటాం

**మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల**

నైపుణ్యాభివృద్ధి.. మౌలిక వసతుల పెంపుపై సీఎం దార్శనికతకు కితాబు

సత్య నాదెళ్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

వివరాలు 2లో

టాప్ న్యూస్

### ఏం మంచి కనిపించిందో


- రేవంత్ రెడ్డిని ప్రశంసించిన పవన్ కల్యాణ్‌పై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



02

### నేటి నుంచి ఏకాదశి అధ్యయనోత్సవాలు


- ముస్తాబైన భద్రాద్రి దేవస్థానం
- 9న గోదావరిలో తెప్పోత్సవం
- 10న ఉత్తరద్వార దర్శనం




03

### ఏపీలో భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపు

- ఫిబ్రవరి నుంచి అమలు
- మంత్రి అనగాని సత్యప్రసాద్



02



## రాష్ట్రంలో 10 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ

**హైదరాబాద్ :** తెలంగాణలో తాజాగా 10 మంది ఐపీఎస్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ ఆఫీసర్లను బదిలీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్(2021), రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని భువనగిరి ఏఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి(2021), ఆసిఫాబాద్ ఏఎస్పీగా చిత్తరంజన్(2022), కామారెడ్డి ఏఎస్పీగా బొక్కా చైతన్య(2022), జనగామ ఏఎస్పీగా పందిరే చైతన్య రెడ్డి(2022), భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్, కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా నగ్రాలే శుభం ప్రకాశ్(2022), నిర్మల్ ఏఎస్పీగా రాజేశ్ మీనా(2022), దేవరకొండ ఏఎస్పీగా పీ మౌనిక(2022) బదిలీ అయ్యారు.

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 78,000 |
| 22 క్యారెట్ | 71,500 |
| సిల్వర్ (కేజీ) | 92,500 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 78,248.13 |
| నిఫ్టీ | 23,644.90 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.5 | 165 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.5 | 165 |
| రిటైల్ గుడ్డు ధర | 5.83 | 174.09 |

### ఈరోజు చికెన్ ధరలు

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర | 180 | 220 | 230 |
| హోల్ సేల్ ధర | 160 | 200 | 210 |

# రేవంతే రైట్



**గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చారు**

- అల్లు అర్జున్ వివాదంపై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు
- రేవంత్ రెడ్డి గొప్పనాయకుడు.. కిందిస్థాయి నుండి ఎదిగారు
- ఏపీలో జగన్ లాగా కాదు.. పుష్ప సినిమాకు సహకరించారు
- తెలంగాణ సీఎం సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి

**అమరావతి, మహా:** అల్లు అర్జున్ వివాదంపై ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకు తెచ్చారని అన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ దిల్‌రాజు పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప నాయకుడని పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన కిందిస్థాయి నుంచి ఎదిగారని అన్నారు. వైఎస్సార్ సీపీ విధానాల తరహాలో తెలంగాణలో వ్యవహరించలేదని పవన్ అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బెనిఫిట్ షోలకు రేవంత్ రెడ్డి అవకాశం కల్పించారని గుర్తు చేశారు. టికెట్ ధరలు పెంపునకు కూడా అవకాశం కల్పించారని పవన్ కల్యాణ్ అన్నారు. అభిమాని చనిపోతే వెంటనే పరామర్శకు వెళ్లి ఉండాల్సిందని పవన్ అభిప్రాయపడ్డారు. అల్లు అర్జున్ కాకున్నా కనీసం నిర్మాతలైనా వెళ్లి ఉండాల్సిందన్నారు. గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకు తెచ్చారు.

మిగతా 2లో

# నయా సాల్.. నయా బాస్.. నయా జోష్

**తెలంగాణ బీజేపీలో కొత్త ఆశలు**

త్వరలో కొత్త అధ్యక్షుడు.. రేసులో ఆ నలుగురు

అధిష్టాన నిర్ణయమే తరువాయి..



**హైదరాబాద్, మహా:** కొత్త సంవత్సరంలో తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు రాబోతున్నారా?.. త్వరలో ఎవరనేది తేలనుందా? పార్టీ హైకమాండ్ ఆ దిశగా కసరత్తు ముమ్మరం చేసిందా? అంటే అవుననే అంటున్నారు పార్టీ వర్గాలు. జనవరి రెండోవారంలోగా తేలుస్తుందన్న చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది. సామాజిక సమీకరణాల కాకుండా.. కేవలం రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధ్యక్షుడ్ని ఎంపిక చేస్తారన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణలో బీజేపీకి మంచి అవకాశాలు ఉన్నా.. ఆ పార్టీ చేస్తున్న తప్పిదాలు, అంతర్గత కుమ్ములాటల కారణంగా అధికారంలోకి వచ్చే అవకాశాలను చేజార్చుకుంటోందన్న ప్రచారం జరుగుతోంది. కర్ణాటకలో బలంగా ఉన్న బీజేపీ, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో తన బలాన్ని పెంచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో బలం ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో బలపడేందుకు

మిగతా 2లో

## మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

**అసెంబ్లీలో రేవంత్ సర్కార్ తీర్మానం.. మద్దతు తెలిపిన విపక్ష బీఆర్ఎస్ పార్టీ**

దేశానికి ఎనలేని సేవలు అందించారంటూ కొనియాడిన సీఎం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యింది. ఈనెల 26న కన్నుమూసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. సభ ప్రారంభం కాగానే సీఎం రేవంత్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా దేశానికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలను సీఎం రేవంత్ గుర్తుచేసుకున్నారు. ఆర్థిక సంస్కరణల రూపకల్పి మన్మోహన్ సింగ్ అని కొనియాడారు.

మిగతా 2లో

### మన్మోహన్ సింగ్ హయాంలోనే ప్రత్యేక రాష్ట్రం

- విప్లవాత్మక సంస్కరణలకు మన్మోహన్ సింగ్ ఆద్యుడు
- భారత రత్న ఇచ్చి తీరాల్సిందే..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



02

## సీఎం రేవంత్‌ను కలిసిన కేఎస్ఆర్

**ముఖ్యమంత్రి ఛాంబర్‌లో మూడు గంటలకు పైగా మీటింగ్**

ఆదిలాబాద్ రాజకీయాలు, అభివృద్ధిపై కీలక చర్చలు

జనవరిలో శుభవార్తలు వింటారన్న కంది శ్రీనివాసరెడ్డి



**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి సోమవారం కలిశారు. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మూడుగంటలకుపైగా

మిగతా 2లో

## బీఆర్ఎస్ నేతలకు చుక్కలు చూపిస్తాం

**కేటీఆర్ అరెస్ట్ పక్కా.. 2025లో బీఆర్ఎస్ కథ క్లైమాక్స్..**

మద్యం దందాలో బెయిల్ మీద ఉండి బీసీల గురించి మాటలు.. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్, డిసెంబర్ 30:** కొత్త ఏడాదిలో బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు సినిమా చూపిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కథ క్లైమాక్స్‌కు వచ్చిందన్నారు. సోమవారం సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ప్రభుత్వ వీప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. కొత్త ఏడాది 2025లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అరెస్ట్ ఖాయమని జోస్యం చెప్పారు. ఇక కొత్త సంవత్సరంలో హరీష్‌రావు కొత్త దారి చూసుకుంటారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కేసులో బెయిల్‌మీద ఉన్న బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి బీసీల గురించి మాట్లాడే హక్కు ఎక్కడదని సూటిగా ప్రశ్నించారు. కవితకు ఏదో ఒక ఇష్యూ కావాలన్నారు.

## న్యూఇయర్ వేడుకలు.. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని ఫ్లైఓవర్ల మూసివేత

**సైబరాబాద్ పోలీసుల ఆంక్షలు.. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మూసివేత**



**హైదరాబాద్ సిటీ, మహా:** న్యూఇయర్ వేడుకల సందర్భంగా సైబరాబాద్ పోలీసులు ఆంక్షలు విధించారు. మంగళవారం రాత్రి ఐటీ కారిడార్‌లోని ఫ్లైఓవర్లను మూసివేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. డిసెంబర్ 31 రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఇవి మూసివేస్తున్నట్లు చెప్పారు.

మిగతా 2లో

# నయా సాల్.. నయా బాస్.. నయా జోష్

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ శ్రమిస్తోంది.

**దక్షిణాది రాష్ట్రాల్లో బలపడేందుకు..**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ వ్యాప్తంగా తన బలాన్ని పెంచుకునేందుకు మరిన్ని ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా ఇప్పటివరకు అధికారంలోకి రాని రాష్ట్రాల్లో ఎలాగైనా పాగా వేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతోంది. కొత్త సంవత్సరమైనా దక్షిణాది రాష్ట్రాల్లో బలపడేందుకు బీజేపీ ఎత్తులకు పై ఎత్తులు వేస్తోంది. కొత్త సంవత్సరం బీజేపీ జాతీయ అధ్యక్షుడితో పాటు వివిధ రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను నియమించనున్నారు. కొత్త అధ్యక్షులు అయినా ఆ పార్టీ కేడర్‌లో నయా జోష్ నింపి.. పార్టీ బలాన్ని పెంచుతారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

**నడ్డా ఆధ్వర్యంలో సమావేశం..**

ఢిల్లీలో ఆదివారం జేపీ నడ్డా ఆధ్వర్యంలో సంఘటన్ సర్వ్ సమావేశం జరిగింది. దీనికి అన్ని రాష్ట్రాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల ఇన్ ఛార్జులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి పురందేశ్వరి, కిషన్ రెడ్డి, డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షురాలు ఎంపీ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ భేటీలో తెలంగాణ పార్టీ బూత్, మండల స్థాయి కమిటీల భర్తీపై నివేదికను నడ్డాకు అందజేశారు కిషన్ రెడ్డి. తెలంగాణలో దాదాపు 70 శాతం బూత్, మండల స్థాయి కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి అయినట్టు తెలిపారు కిషన్‌రెడ్డి. జనవరి ఫస్ట్ వీక్‌లో పదాధికారులు, జిల్లా అధ్యక్షుల పదవుల భర్తీ చేయనున్నారు. దీంతో కొత్త బాస్ ఎవరనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.



**రేసులో ఉన్నది వీరే..**

కొత్త అధ్యక్షుడి రేసులో నలుగురు నేతల పేర్లు వినిపిస్తున్నాయి. వారంతా ఎంపీలే కావడం గమనార్హం. ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, ఈటల రాజేందర్, బండి సంజయ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు ఎవరూ రేసులో లేనట్టు తెలుస్తోంది.

**ఢిల్లీలో జోరుగా పైరవీలు..**

వీరంతా ఎవరికి వారే ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక అధిష్టానికి కత్తి మీద సాముగా మారింది. ఈ నలుగులు ఎవరికైనా ఇస్తే పార్టీకి ఇబ్బందులు వస్తాయని భావించి కొత్త వ్యక్తిని తెరపైకి తెస్తుందా? అనే చర్చ లేకపోలేదు. ఇది నాణెనికి ఒక వైపు మాత్రమే.

**అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యలతో..**

మరోవైపు అంబేడ్కర్‌పై హోంమంత్రి అమిత్ షా వివాదాస్పద వ్యాఖ్యలు పార్టీని డ్యామేజ్ చేశాయనే చర్చ మొదలైంది. దాని నుంచి బయటపడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో దళిత వ్యక్తిని జాతీయ అధ్యక్ష పీఠంపై కూర్చొబెడితే ఎలా ఉంటుందనే దానిపై ఆలోచన చేస్తోందట.

### కేడర్‌లో జోష్ వచ్చేనా?

**తెలంగాణలో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు హైదరాబాద్ మహా నగర పాలక సంస్థకు ఎన్నికలు జరగనున్నాయి. కొత్త సంవత్సరంలో తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడిని నియమించనున్నారు. గతంలో బండి సంజయ్‌ను అధ్యక్షుడిగా నియమించిన తర్వాత జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. బండి సంజయ్ కార్యకర్తల్లో జోష్ నింపడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో బలపర్చేందుకు కృషిచేశారు. కొత్త అధ్యక్షులు తెలంగాణలో బీజేపీని బలోపేతం చేస్తారా.. కేడర్‌లో జోష్ నింపుతారా అనేది రానున్న రోజుల్లో తేలనుంది.**

# అన్ని కార్యక్రమాల్లో ప్రభుత్వ భాగస్వామిగా ఉంటాం



**హైదరాబాద్.మహా :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండాలనే తమ నిబద్ధతను కొనసాగిస్తామని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల తెలిపారు. హైదరాబాద్‌లోని సత్య నాదెళ్ల నివాసంలో ఆయనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం సోమవారం భేటీ అయింది. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. నైపుణాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే ఆర్థికాభివృద్ధికి దోహదపడి హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఉంచగలవని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం 10,000 మందికి ఉపాధి కల్పిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సత్య నాదెళ్లకు తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల (MW) సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందని, హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెంచుతూ పోతున్నందుకు సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌ను టెక్నాలజీ డొమైన్‌లో ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపివేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారిస్తున్న ఏఐ, Gen AI, క్లౌడ్‌తో సహా వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణమైన వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మైక్రోసాఫ్ట్ మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సత్య నాదెళ్లకు విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబాటులో ఉంచేందుకు తాము చేస్తున్న కృషిని సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.



# ఏపీలో భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపు

**ఫిబ్రవరి నుంచి అమలు**

**మంత్రి అనగాని సత్యప్రసాద్**

**ఏపీ:** భూముల రిజిస్ట్రేషన్ విలువలకు సంబంధించిన ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న నూతన ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ పెంపు ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఏ ప్రాంతాల్లో ఎంత పెంచాలి..? ఏ ప్రాంతాల్లో ఎంత తగ్గించాలో అనే అంశాలపై జనవరి 15లోగా నివేదిక ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. రిజిస్టేషన్ అండ్ స్టాంప్స్ శాఖపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా అప్పుల భారం వల్ల ఇప్పుడిప్పుడే రాష్ట్రం కోలుకుంటుందన్నారు. రాష్ట్రానికి రెవెన్యూ చాలా అవసరం.. ఈ నేపథ్యంలోనే పెంచాల్సి వచ్చిందంటూ ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గ్రోత్ కారిడార్లు, భూమి రేట్లు పెరిగిన చోట మాత్రమే రిజిస్ట్రేషన్ విలువలను పెంచుతామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కారణంగా భూమి విలువ కంటే రిజిస్ట్రేషన్ విలువే అధికంగా ఉందన్నారు. ఈ పరిస్థితులను కూడా సరిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎక్కడెక్కడైతే ఎక్కువగా ఉన్నాయో అక్కడ తగ్గిస్తామన్నారు. సగటున 15 నుంచి 20 శాతం వరకు పెంపు ఉంటుందన్నారు.



# సీఎం రేవంత్‌ను కలిసిన కేఎస్ఆర్

**ముఖ్యమంత్రి ఛాంబర్ లో మూడు గంటలకు పైగా మీటింగ్**

**ఆదిలాబాద్ రాజకీయాలపై, అభివృద్ధిపై కీలక చర్చలు**

**జనవరిలో శుభవార్తలు వింటారన్న కంది శ్రీనివాసరెడ్డి**

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీయం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్కతో కలిసి ఆదిలాబాద్ కు సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. ఆదిలాబాద్ కు సంబంధించిన అభివృద్ధి పనులు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపైనా చర్చ జరిగింది. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి అందిన ఆహ్వానం మేరకు సోమవారం హుటాహుటిన ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వచ్చిన కంది శ్రీనివాసరెడ్డి సీఎంను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎం రేవంత్ రెడ్డి కంది శ్రీనివాసరెడ్డిని ఆత్మీయంగా పలకరించడంతోపాటు పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీని బలోపేతం చేయడంపై అభినందించారు. ఆదిలాబాద్ లో పార్టీ ప్రగతికి పునరంకితం కావడం పట్ల ప్రశంసించారు. సీఎంతో భేటీ నేపథ్యంలో కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జనవరిలో ఆదిలాబాద్ కు సంబంధించి అనేక శుభవార్తలు ముఖ్యమంత్రి ద్వారా వింటారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే ఆదిలాబాద్ అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి అనేక ముఖ్యమైన అంశాలు చర్చించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో ఆదిలాబాద్ ను ముందువరుసలో నిలుపుతామన్నారు.

# రేవంతే రైట్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి గొప్ప నాయకుడు. కిందిస్థాయి నుంచి ఎదిగారు. వైఎస్సార్‌సీపీ విధానాల తరహాలో తెలంగాణలో వ్యవహరించలేదు. రాష్ట్రంలో బెనిఫిట్ షోలకు అవకాశం ఇచ్చారు. టిక్కెట్ ధర పెంపునకు అవకాశమిచ్చారు. అల్లు అర్జున్ విషయంలో ఏం జరిగిందో నాకు తెలియదు. తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు తెలియదు. ఇలాంటి ఘటనల్లో నేను పోలీసులను తప్పుపట్టను" అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

**అందరూ రేవతి ఇంటికి వెళ్లి పరామర్శించి ఉండాల్సింది**

అల్లు అర్జున్ విషయంలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించిందని పవన్ కల్యాణ్ అన్నారు. అందరూ రేవతి ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. పరామర్శించకపోవడం వల్ల ప్రజల్లో ఆగ్రహం వచ్చిందని తెలిపారు. పుష్ప సినిమాకు సీఎం రేవంత్ రెడ్డి సహకరించారన్నారు. పుష్ప టిక్కెట్ రేట్లు పెంచారని, బెనిఫిట్ షోకు అవకాశమిచ్చారని గుర్తు చేశారు. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి స్పందించారని పవన్ కల్యాణ్ తెలిపారు. కొన్నిసార్లు పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రేవంత్ చాలా డైనమిక్ లీడర్ అన్న ఆయన, తెలంగాణ సీఎం సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయని గుర్తు చేశారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం సాఫ్ట్‌గా వెళ్లి ఉంటే బాగుండేదని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

# న్యూఇయర్ వేడుకలు.. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని ఫ్లైఓవర్ల మూసివేత



(మొదటి పేజీ తరువాయి)

ఔటర్ రింగ్ రోడ్డుపై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపడతారన్నారు. న్యూఇయర్ సమయంలో మద్యం సేవించిన వారికి పబ్‌లు, బార్ల యజమానులు ప్రైవేటు వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. మరోవైపు, న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31న రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. 500 కార్లు, 250 క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

### మెట్రో ప్రయాణ వేళల్లో మార్పులు

నూతన సంవత్సరాది సందర్భంగా మెట్రో ప్రయాణ వేళల్లోనూ మార్పులు చేశారు. రేపు అర్ధరాత్రి 12.30 వరకు మెట్రో సర్వీసులను పొడిగిస్తూ ఎల్ అండ్ టీ మెట్రో నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎల్ అండ్ టీ మెట్రో వెల్లడించింది. ప్రతి కారిడార్‌లో చివరి మెట్రో స్టేషన్ నుంచి ఆఖరి సర్వీస్ అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరుతుందని తెలిపింది.

## ఏం మంచి కనిపించిందో

**హైదరాబాద్, మహా:** సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసించడాన్ని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తప్పుబట్టారు. పవన్ కల్యాణ్‌కు రేవంత్ రెడ్డిలో ఏం మంచి కనిపించిందోనని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని అమలు చేయనందుకు ఆయనకు నచ్చారేమోనని విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి గొప్ప నాయకుడని పవన్ కల్యాణ్ అన్నారని, దీనిపై మీరేం చెబుతారని ఓ మీడియా ప్రతినిధి... బండి సంజయ్‌ని ప్రశ్నించారు. మీడియా ప్రతినిధి ప్రశ్నపై బండి సంజయ్ స్పందించారు. రేవంత్ రెడ్డి ఎందుకు గొప్ప నాయకుడిగా కనిపించాడో పవన్ కల్యాణ్‌కు తెలియాలన్నారు. ఎందులో గొప్పనో, ఏ యాంగిల్ లో గొప్పనో తనకైతే తెలియదన్నారు. రైతు భరోసా, తులం బంగారం, 2 లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, రూ.4 వేల ఆసరా పెన్షన్ ఇస్తున్నామని చెవిలో చెబితే గొప్పవాడిగా కనిపించాడేమోనని ఎద్దేవా చేశారు.

# మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

**అసెంబ్లీలో రేవంత్ సర్కార్ తీర్మానం.. మద్దతు తెలిపిన విపక్ష బీఆర్ఎస్ పార్టీ**

**దేశానికి ఎనలేని సేవలు అందించారంటూ కొనియాడిన సీఎం**

(మొదటి పేజీ తరువాయి)

దేశానికి ఆయన విశిష్ట సేవలు అందించారన్నారు. ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని రేవంత్ అన్నారు.

**దేశానికి విశిష్ట సేవలు..**

'మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలందించారు. కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్ గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా సేవలందించారు. ప్రధానిగా పదేళ్లు అద్భుతమైన పాలన అందించారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు. తెలంగాణ రాష్ట్రానికి మన్మోహన్ ఆత్మబంధువు. తెలంగాణతో ఆయన బంధం విడదీయరానిది. రాష్ట్రహోదా కల్పించిన మానవతావాది. తెలంగాణ ప్రజల గుండెల్లో మన్మోహన్ స్థానం శాశ్వతం. ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించాలి' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిలూదారు..**

భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ప్రకటించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ తీర్మానానికి విపక్ష బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిలూదారని ప్రశంసించారు. 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థను వృద్ధిబాట పట్టించారని కొనియాడారు.



**సంస్కరణల రూపశిల్పి..**

దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని, వరుసగా రెండు పర్యాయాలు ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, ఆర్బీఐ గవర్నర్‌గా ఎనలేని సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్ గా పనిచేశారని చెప్పారు. దేశానికి విశిష్ట సేవలు అందించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. విపక్షనేత, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానానికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తోందని ప్రకటించారు. దేశ అత్యున్నత పౌరపురస్కారానికి మన్మోహన్ సింగ్ పూర్తి అర్హులు అని పేర్కొన్నారు.

# మన్మోహన్ సింగ్ హయాంలోనే ప్రత్యేక రాష్ట్రం

**విప్లవాత్మక సంస్కరణలకు ఆద్యుడు.. భారత రత్న ఇచ్చి తీరాల్సిందే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, మహా:** మన్మోహన్ సింగ్ గొప్పతనం, సామర్థ్యం, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదని చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిందని తెలిపారు. కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'దివంగత మాజీ ప్రధాని మాన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్ఎస్ తరపున పూర్తిగా మద్దతిస్తున్నాం. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాం.

**గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని గుర్తించింది పీవీయే..**

మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశం. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత లాటరీ ఎంట్రీ ద్వారా రాజకీయాలతో సంబంధ లేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది. నా దేశం మేల్కొని ఉంది..' అంటూ ఆర్థిక వేత్తగా సంస్కరణలను ప్రవేశపెట్టే సందర్భంగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్ధాంతం, పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శిలి డాక్టర్ మన్మోహన్ సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్ సింగ్‌ను మనం చెప్పుకోవచ్చు. విశ్వాసం అనే నేటి రాజకీయాల్లో అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన అభ్యుదయ వాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్.



**విప్లవాత్మక సంస్కరణలు..**

ఎన్నో అడ్డంకులు, ఎన్నో అభ్యంతరాలున్నా మన్మోహన్ సింగ్ ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడ్డారు. ఎన్నడూ కూడా, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంస్కరణల బాట నుంచి వెనక్కి తగ్గలేదు. ఆయన్ని మనం సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అని పిలువవచ్చు. మన్మోహన్ కాదు ఈయన మౌన మోహన్ సింగ్ అని, మౌన ముని అని పేర్లు పెట్టారు. అయితే అవేవీ పట్టించుకోకుండా ఆయన పని ఆయన చేసుకుంటూ పోయారు. విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చారు. అవమానం చేస్తే ఆకాశం స్థాయి తగ్గదు. ఎన్ని నిందలు వేసిన మహోన్నతులు వణకరు, బెనకరు. అలాంటి స్థితప్రజ్ఞతను మనం మన్మోహన్ సింగ్‌లో చూశాం. సీఎం ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణ తెలుపుతున్నాం. ఆ కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని తెలుపుతున్నాం' అని కేటీఆర్ అన్నారు.

## విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సర్వ శిక్షా ఉద్యోగులు

# సమ్మె విరమించండి

**25 రోజులుగా కేజీబీవి స్కూల్లలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు**

**సమ్మె విరమిస్తే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి**

**సర్వ శిక్షా ఉద్యోగుల సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,సీతక్క**



**హైదరాబాద్,మహా:** గత 25 రోజులుగా సమ్మె చేస్తున్న దాదాపు 19,500 మంది సర్వ శిక్షా ఉద్యోగులు కేజీబీవి ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే సమ్మె విరమించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క కోరారు. సమ్మె చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని కేజీబీవీ పాఠశాలల్లో బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుతున్నారని సమ్మె చేస్తూ వారిని అక్కడ చదువుతున్న విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయవద్దని సర్వ శిక్షా ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. తాము సుదీర్ఘ కాలంగా కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేస్తున్నామని తమని రెగ్యులరైజ్ చేయడం లేదా ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కూల్ అమలు చేయాలని సర్వ శిక్షా ఉద్యోగులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. సర్వ శిక్షా కస్తూర్బా గాంధీ పాఠశాలు కేంద్రం పరిధిలో 60 శాతం రాష్ట్రం పరిధిలో 40 శాతం ఉంటుందని ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సర్వ శిక్షా ఉద్యోగుల సమస్య తెలంగాణలోనే లేదని దేశ వ్యాప్తంగా ఉందని కేంద్ర ప్రభుత్వం కోరితే ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోయి కేంద్రానికి ప్రతిపాదనలు పెడతామని మంత్రి పొన్నం వెల్లడించారు. 25 రోజులుగా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేయడం వల్ల వారికి విద్యాబోధన జరగక తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణమే సమ్మె విరమించి ఉద్యోగులు విధుల్లో చేరాలని కోరారు. సమ్మె విరమిస్తే వారి సమస్యల పై ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పడిన సబ్ కమిటీ తో సమావేశానికి పిలుస్తమని సబ్ కమిటీ లో తనతో పాటు మంత్రి శ్రీధర్ బాబు ,ప్రభుత్వ సలహాదారు కేశవ రావు కూడా ఉన్నారని సబ్ కమిటీ లో సర్వ శిక్షా ఉద్యోగుల సమస్యల పై చర్చిస్తామని పేర్కొన్నారు.నాన్ ఫైనాన్సియల్ డిమాండ్స్ లో మహిళా ఉద్యోగులకు మెటర్నరి లీవ్స్ ,సీఎల్ లు తదితర వాటిపై సాధ్యమైనంత వరకు ప్రభుత్వం పరిష్కరమయ్యేలా ప్రభుత్వం చూస్తుందని , ఆర్థికపరమైన డిమాండ్స్ పై సబ్ కమిటీ లో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి , ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సర్వ శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహ రెడ్డి ,మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# నేటి నుంచి ఏకాదశి అధ్యయనోత్సవాలు


**ముస్తాబైన భద్రాద్రి దేవస్థానం.. 9న గోదావరిలో తెప్పోత్సవం**

**కొత్తగూడెం:** భద్రాచలంలోని ప్రముఖ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. జనవరి 8 వరకు ప్రతి రోజూ ఒక అలంకారంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో భద్రగిరి ముస్తాబు చేశారు. ఆలయ పరిసరాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. కరకట్ట, రామాలయ పరిసరాలు, బ్రిడ్జి పాయింట్ తోపాటు పలు ప్రాంతాల్లో భక్తులకు స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు అలంకరణ భద్రాద్రి దేవస్థానం కనువిందుగా కనిపిస్తుంది. ఈ నెల 9న పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం, 10న ఉత్తరద్వారం దర్శనం వేడుకలు నిర్వహించనున్నారు. గోదావరి తీరంలో కూడా హంస వాహనాన్ని ముస్తాబు చేశారు. పర్ణశాల రామాలయం కూడా ముక్కోటి వేడుకలకు ముస్తాబైంది. వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు నేడు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



# వారానికి 4 సిఫార్సు లేఖలు

**తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై చంద్రబాబు కీలక నిర్ణయం**



**తిరుపతి, మహా:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలను అనుమతించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించినట్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. సోమవారం ఏపీ సీఎం చంద్రబాబుతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై చంద్రబాబుతో చర్చించారు. వారానికి 4 సిఫార్సు లేఖలను అనుమతించేందుకు చంద్రబాబు అంగీకరించినట్లుగా బీఆర్ నాయుడు తెలిపారు. వారానికి 2 బ్రేక్ దర్శనాలు, రెండు 300 రూపాయల దర్శనానికి సంబంధించిన లేఖలను అనుమతించేందుకు సీఎం చంద్రబాబు అనుమతి ఇచ్చారని బీఆర్ నాయుడు వెల్లడించారు.

### వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్న టీటీడీ

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు కొలువై ఉన్న తిరుమల శ్రీవారి ఆలయంలో పది రోజుల పాటు జరగనున్న వైకుంఠ ద్వార దర్శనానికి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమం జనవరి 10 నుంచి 19 వరకు 10 రోజుల పాటు రోజుకు దాదాపు 70,000 పైగా భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. రూ.300 రూపాయల స్పెషల్ ప్రవేశ దర్శనం టికెట్లను ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. రోజుకు 40 వేల టికెట్ల చొప్పున 10 రోజులకు 4 లక్షల సర్వదర్శన టోకెన్లను తిరుపతిలో 8, తిరుమలలో ఒక కేంద్రం ద్వారా టికెట్లను జారీ చేయడానికి టీటీడీ విస్తృత ఏర్పాట్లను చేస్తోంది. తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి 10 రోజుల శ్రీవాణి టికెట్లను ఇప్పటికే అధికారులు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. 10 రోజుల స్పెషల్ ఎంట్రీ దర్శన్ టోకెన్లను ఆన్‌లైన్‌లో విధానంలో జారీ చేస్తారు. 10 రోజులకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో ఎనిమిది సెంటర్లు, తిరుమలలో ఒక కేంద్రంలో సర్వ దర్శనం టోకెన్లు జారీ చేస్తారు.

# కుత్బుల్లాపూర్ రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో..!

## 12 ఫీట్ల రోడ్లతో నానా అవస్థలు

**నిత్యం వందలాది ప్రజల రాకపోకలు**

**ప్రతిరోజూ ప్రమాదంలో ప్రయాణికులు**



**అబ్దుల్లాపూర్మెట్, డిసెంబర్ 30 మహా:** విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ కు ఆనుకొని ఉన్న గ్రామాలు అవి. మొన్నటికి మొన్న రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీలో కలుపుతూ నిర్ణయం కూడా తీసుకుంది. వేల సంఖ్యలో కుటుంబాలున్న ఇలాంటి గ్రామాలకు వెళ్లే మార్గం మాత్రం 12 ఫీట్ల రోడ్లే. వేలాది సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తున్నఈ మార్గం వందల మంది ప్రాణాలు కోల్పోతున్నా... ఈ రోడ్డు విస్తరణకు మాత్రం మోక్షం దక్కడం లేదు. దీంతో ఈ మార్గంలో వెళ్లాలంటే ఆ గ్రామాల ప్రజలు జంకుతున్నారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని కుత్బుల్లాపూర్, గౌరెల్లి గ్రామాలకు వెళ్లే మార్గం ఇది. కుంట్లూరు నర్సరీ నుంచి కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు మొత్తం 12 ఫీట్లు ఉంటుంది. ఈ రోడ్డు మార్గం నుంచి వేల సంఖ్యలో స్థానికులు రాకపోకలు సాగిస్తారు. కుత్బుల్లాపూర్ రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడని ప్రస్తాదిస్తారోనని గ్రామస్తులు, స్థానికులు, ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డు మొత్తం 12 ఫీట్లు ఉండడంతో ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు విరగడమేకాక మరికొందరి ఊపిరి వదలిన సంఘటనలు ఉన్నాయని స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుత్బుల్లాపూర్, గౌరెల్లి ప్రాంతాల్లో పశుగ్రాసం (గడ్డి) పెంపకం చేస్తుంటారు ఇక్కడి రైతులు. ఆ గడ్డిని హైదరాబాద్ నగరానికి తలించే లారీలు, డీసీఎంలు ఇక్కడ నుంచి ఈ రోడ్డు మార్గం గుండానే వెళ్తుంటాయి. అదేవిధంగా క్రషర్ల నుంచి నగరానికి వచ్చే వందలాది లారీలు రాకపోకలు కొనసాగిస్తాయి. మూలమలుపులు కూడా ఎక్కువే. కుత్బుల్లాపూర్ గ్రామంలో ఎక్కువ మంది పాల వ్యాపారం చేస్తుంటారు. వీరు నాగోల్, దిల్ సుఖ్ నగర్ తదితర నగరాలలో ఉన్న హోటల్, బేకరీలు, కాలనీ వాసులుకు పాలు విక్రయిస్తుంటారు. కుత్బుల్లాపూర్ నుంచి నగరానికి తరలించే క్రమంలో రోడ్డు ఇరుకుగా ఉండడం వలన అనేక ప్రమాదాలకు గురవుతున్నామని వివరించారు. కుత్బుల్లాపూర్ వెళ్లే రోడు మార్గం ఉన్నది 12ఫీట్లే. వర్షాలు పడి రోడ్డు కోతకు గురై.. రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో వాహనాలు రోడ్డు దిగాల్సి వస్తోంది. భారీ వాహనాల కమాన్ పట్టాలు విరిగిపోతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. దీంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వక్తం చేశారు.

**ఉన్నది 12ఫీట్ల రోడ్డే.. మళ్లీ గుంతలు..**

కుంట్లూరు నర్సరీ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ గ్రామానికి 3.5 కిలోమీటర్లు. ఈ రోడ్డు మార్గం విస్తరణ 12 ఫీట్లు. ఈ రోడ్డు మార్గం నుంచి వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఉన్నదే చిన్నరోడ్డు.. రోడ్డు మార్గం గుంతలు ఏర్పడి... ప్రయాణీలకు నానా ఇబ్బందులు గురవుతున్నామని తెలిపారు. ఈ మార్గం నుంచి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని ప్రయాణీలు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కుంట్లూరు నర్సరీ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ వెళ్లే రోడ్డు ఇరువైపులా గుంతలు ఏర్పడింది. ఈ రోడ్డు మార్గం నుంచి ప్రయాణం చేసేది ఎలా అని కుత్బుల్లాపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హామీలతోనే సరి...**

**కుత్బుల్లాపూర్ గ్రామానికి సంబంధించిన రోడ్డు విస్తరణపై పలు సందర్భాలలో నేతలు హామీలతో సరి చెప్పారని... ఆచరణలో నేరవేర్చలేకపోయారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వస్తే చాలు ఆ పార్టీ, ఈ పార్టీ అనే తేడాలు లేకుండా హామీలు ఇచ్చి ఎన్నికలలో నెగ్గాక తమ సమస్యలపై కన్నెత్తికూడా చూడడంలేదని గ్రామస్తులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులు రోడ్డు విస్తరణ చేయిస్తామని హామీలు ఇచ్చి వదిలేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు నాయకులు ప్రజలకు హామీలు ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు సంవత్సరం అవుతున్నా తమ గ్రామానికి రోడ్డు విస్తరణ పనులు మాత్రం చేపట్టలేదన్నారు.**

**వారంలో ఒక ప్రమాదం..**

ఈ రోడ్డు మార్గం గుండా రాకపోకలు చేసేవారు ఎక్కువ. భారీ వాహనాలు వెళ్లే సమయంలో వారు రోడ్డు దిగకపోవడంతో టూవీలర్ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గడ్డికొట్టే వాహనాలు, ఆర్ఎంసీలుల వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఈ భారీ వాహనాలు ఎదురుదురు పడినప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆ వాహనాలు డ్రైవర్లు తెలుపుతున్నారు. రోడ్డు ఇరువైపుల భారీ గుంతలు ఉండటంతో రోడ్డు దిగుతున్న క్రమంలో లారీ, డీసీఎం, వ్యాన్ వాహనాదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. వారంలో ఏదో ఒక రోజు ప్రమాదాలు గురవుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఈ ప్రమాదంలో కాళ్లు, చేతులు విరగడంతోపాటు మరికొన్ని సందర్భాలలో ప్రాణాలు పోతున్నాయంటూ పేర్కొంటున్నారు.

**పాడి పరిశ్రమం ఎక్కువ...**

కుత్బుల్లాపూర్-గౌరెల్లి గ్రామాలకు చెందిన రైతులు ఎక్కువ డైరీ ఫామ్ లు నిర్వహిస్తుంటారు. ఆ డైరీ ఫామ్లు ద్వారా వచ్చిన పాలను పాల వ్యాపారులు హైదరాబాద్ లో ఉన్న హోటల్, బేకరీలకు అమ్ముకొని జీవనం సాగిస్తుంటారు. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన పాల వ్యాపారులు రోజు ఉదయం, సాయంత్రం పాలను నాగోల్, దిల్ సుఖ్ నగర్ కు తరలిస్తారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా టూవీలర్ వాహనాలపై పాలను తరలిస్తారు. ఈ క్రమంలో వారు వెళ్లే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నామని తెలిపారు. రాత్రి సమయంలో తమ ప్రయాణం మరి దారుణంగా ఉందంటూ వారు చెబుతున్నారు. భారీ వాహనాలు వచ్చే సమయంలో లైట్ల పోగస్ తో... అందులో రోడ్డు 12 ఫీట్లు ఉండడం, ఉన్న రోడ్డు గుంతలు ఉండడంతో నానా ఇబ్బందులు పడుతూ... ప్రమాదాలకు గురవుతున్నామని పాల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదలకు గురవుతున్నాం

" కుత్బుల్లాపూర్ గ్రామంలో ఎక్కువగా పాడిపరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తాం. గ్రామానికి చెందిన చాలామందిమి పాల వ్యాపారం చేస్తుంటాం. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గ్రామం నుంచి నాగోల్, దిల్ సుఖ్ నగరాల్లో ఉన్న హోటల్, బేకరీలు, కాలనీ వాసులకు పాలను విక్రయిస్తుంటాం. ఈ సమయంలో ఉదయం, రాత్రి అని తేడాలు లేకుండా రోజూ రెండు సార్లు తిరుగుతుంటాం. ఈ సమయంలో రోడ్డు చిన్నగా ఉండడంతో రాత్రి సమయాలలో ప్రమాదాలకు గురవుతున్నాం. అదేవిధంగా ఇతర గ్రామాలకు చెందిన వారు ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో అనేక సందర్భాలలో ప్రమాదాలు చూవిచూడాల్సి వస్తోంది.

– **మేకల రమేశ్, పాల వ్యాపారి, కుత్బుల్లాపూర్**

### సిగ్నల్స్ రాక ఫోన్లు పనిచేయవు..

" కుంట్లూరు నర్సరీ నుంచి కుత్బుల్లాపూర్ వెళ్లే రోడ్డు మార్గం 12 ఫీట్లే. గుంతలు గుంతలుగా ఉండే ఈ మార్గం గుండా చాలామంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటాం. ఈ క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాం. రోడ్డు ఉన్నదే చిన్నగా... అందులో మూలమలుపులు ఎక్కువ. అంతా అటవీ ప్రాంతం కావడంతో ఈ మార్గంలో ప్రమాదాలు సంభవించినప్పుడు అంబులెన్స్ కానీ, పోలీసులకు, కుటుంబ సభ్యులు కానీ సమాచారం తెలియజేద్దామనుకున్న ఫోన్లు పనిచేయవు. అటవీ ప్రాంతం కావడంతో నెట్వర్క్ సిగ్నల్స్ సరిగా రావు. అందువల్ల ఫోన్ కూడా పనిచేయవు. దీంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నాం.

- **తొంట బాబు, కో ఆప్షన్ మెంబర్, కుత్బుల్లాపూర్**

# ముందు ఎమ్మెల్సీ.. తరువాత మంత్రి పదవి

**నాగబాబుకు మంత్రి పదవిపై స్పందించిన పవన్**

**రాజకీయాల్లో పని తీరే ప్రామాణికం.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**ఏపీ, మహా:** నాగబాబుకు మంత్రి పదవి విషయమై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. సోమవారం మంగళగిరిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాగబాబుకు మంత్రి విషయమై ఓ విలేకరి అడుగగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో పనితీరే ప్రామాణికమన్నారు. అంతే తప్ప కులం, బంధుప్రీతి అనేది ముఖ్యం కాదన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవాళ్లను గుర్తించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. పార్టీ కోసం నాగబాబు తనతోపాటు ఎంతో కష్టపడ్డారని గుర్తుచేశారు. వైసీపీ నేతలతో తిట్లు కూడా తిన్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ కోసం నాగబాబు నిలబడ్డారన్నారు. ఆయన సేవలను గుర్తించాలన్న ఉద్దేశంతో నాగబాబును ముందుగా ఎంపీగా ప్రకటించాం కానీ, ఆ తరువాత ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందన్నారు. జనసేనలో పార్టీ కోసం కష్టపడ్డవారికి ఖచ్చితంగా గుర్తింపు దక్కుతుందన్నారు. అందులో భాగంగానే కందుల దుర్గేష్ కు మంత్రి పదవి దక్కిందన్నారు. హరిప్రసాద్, మనోహర్ కూడా పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడ్డారంటూ గుర్తుచేశారు. నాగబాబుకు కూడా త్వరలోనే పదవి లభిస్తుందన్నారు. ముందుగా ఆయన ఎమ్మెల్సీగా ఎంపికవుతారన్నారు. మంత్రి పదవి విషయమై ఆ తరువాత చర్చిస్తామంటూ పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 30, మహా:** రంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. పాల తయారీ నిల్వ, విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాలతో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ పి. రోహిత్ రెడ్డి, పి. స్వాతి, జగన్నాథ్, శివశంకర్ రెడ్డిలతో కూడిన బృందం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని పసుమాముల గ్రామంలోని ఆల్ రిచ్ డైరీ ప్రైవేట్ లిమిటెడ్( శ్వేత బ్రాండ్ పాలు,పెరుగు) పాలు, పాల ఉత్పత్తుల తయారీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ ఉల్లంఘనలను గుర్తించారు. బ్రాండ్ పై లైసెన్స్ విషయంలో స్పష్టత లేకుండా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. పూర్తిగా అపరిశుభ్రత వాతావరణంలో వాటిని తయారుచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. నిబంధనలు పాటించని, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే సీజ్ చేస్తామని తేల్చి చెప్పారు. వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.


EDITORIAL ఎడిటోరియల్





# బైబై 2024

## ఎన్నికల్లో తొలివిజయం అందుకున్న సెలబ్రిటీలు

ఈ ఏడాది ఎందరో సెలబ్రిటీల జాతకాలు మారిపోయాయి. అధ్యక్షా అనే అవకాశం దక్కించుకున్న సెలబ్రిటీలు ఎంతోమంది. 2024 ఏడాదిలో రాజకీయాలు ఒక ఊపు ఊపాయి. నవ్యోత్సాహం తొణికిసలాడింది. దేశ వ్యాప్తంగా అనేక సంచలనాలు జరిగాయి.. పాత వారు పోయారు...కొత్త వారు వచ్చారు. ఇందులో కొంత మంది సెలబ్రిటీలు కూడా ఉన్నారు. వయనాడ్‌లో ప్రియాంకాగాంధీ. హిమాచల్ ప్రదేశ్ లో కంగనారనౌత్, పిఠాపురంలో పవన్‌కల్యాణ్, మంగళగిరిలో నారా లోకేష్ వరకు ఎందరో ప్రముఖులు ఎన్నికల్లో గెలిచారు. 2024 వారికి స్వీట్ ఇయర్ గా మారింది.

### ప్రియాంకా గాంధీ

తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టి రికార్డు విజయం అందుకున్నారు ప్రియాంకగాంధీ వాద్రా. రాజీవ్ గాంధీ కూతురుగా, రాహుల్ చెల్లెల్లుగా ప్రియాంకాగాంధీ అందరికీ తెలిసిన వారే. రాజకీయ కుటుంబంలో పుట్టి..వాటితో చాలా దగ్గరగా సంబంధం ఉన్నా కూడా ఎప్పుడూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు. ప్రచారసభల్లో, కాంగ్రెస్ మీటింగ్‌లలోరాల్గొనే ప్రియాకాగాంధీ మొట్టమొదటి సారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. తొలిసారి లోక్‌సభలోకి అడుగుపెట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ వాయనా, రాయబరేలీ రెండు చోట్ల నుంచి గెలిచారు. అయితే ఇందులో ఒకటే స్థానాన్ని ఉంచుకోవాల్సి వచ్చింది. దాంతో ఆయన వాయనాడ్‌ను వదులుకున్నారు. దీంతో అక్కడ మళ్ళీ ఎన్నికలను నిర్వహించారు. ఇందులో కాంగ్రెస తరుపు నుంచి ప్రియాంక గాంధీ నిలబడి విజయం సాధించారు. పోటీ చేసిన మొదటిసారే గెలిచి రికార్డ్ సృష్టించారు.

### పవన్ కల్యాణ్

2024 ఏడాది పవన్ కల్యాణ్‌కు బాగా కలసి వచ్చిన మెగా సంవత్సరం. 2019 ఎన్నికల్లో పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయిన పవన్ కల్యాణ్ 2024 ఎన్నికల్లో మాత్రం తనదైన ముద్ర వేశారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్ అవడం, టీడీపీ, జనసేన, బీజేపీలు కలవడం, ఎన్నికల ప్రచారంలో కీలక భూమిక పోషించడంతో పాటు పిఠాపురం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిచారు కూడా. 2019లో చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ...ప్రజల్లోకి వెళ్ళి మంచి నేతగా పేరు సంపాదించుకున్నారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలను కూడా చేట్టారు. మంత్రిగా కూడా తనదైన ముద్రవేస్తున్నారు.

### నారా లోకేశ్

ఈ ఏడాది నారాలోకేష్ తిరుగులేని విజయాలు అందుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు తనయుడు నారా లోకేశ్. స్వశక్తితో ఓడిన చోటే నెగ్గారు. యుగవళం పాదయాత్రతో చరిత్ర క్రియేట్ చేశారు. 2024 ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలు చేసి పార్టీ గెలవడానికి కృషి చేశారు. రెడ్ బుక్ పేరుతో ప్రత్యర్థులకు చెమటలు పట్టించారు.

### కంగనా రౌనత్


బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేసి ఎంపీగా ఎన్నికైంది. ఆమె హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని మండీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగింది. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్ పై 74,755 ఆధిక్యంతో గెలుపొంది తొలిసారి సంచలనాలకు కేరాఫ్ గా నిలిచింది.

### యువ ఎంపీలు

తెలంగాణ నుండి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీగా పోటీచేసిన మొదటిసారే భువనగిరి నుండి సంచలనవిజయం సాధించారు. నల్లగొండలో రఘువీర్ రెడ్డి రికార్డు విజయం అందుకున్నారు. వరంగల్ లో కడియం కావ్య మంచి విజయం అందుకున్నారు. ఎపిలో చూస్తే పెమ్మసాని చంద్రశేఖర్ అరంగేట్రంలోనే విజయం సాధించడమే కాకుండా ఏకంగా కేంద్రమంత్రి అయ్యారు. డికె అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్ రావు తొలిసారి పార్లమెంట్ మెట్లు ఎక్కారు.

## ఈ ఆహారాలను తింటే చాలు.. రక్తం కడిగేసినట్లు క్లీన్ అవుతుంది..!

*మన శరీరానికి రక్తం ఇంధనం లాంటిదని చెప్పవచ్చు. ఇది అనేక రకాల పోషకాలను శరీరంలోని కణాలకు, అవయవాలకు సరఫరా చేస్తుంది. అలాగే ఆక్సిజన్‌ను రవాణా చేస్తుంది. దీంతో శరీర అవయవాలకు ఎప్పటికప్పుడు శక్తి, పోషణ లభిస్తాయి. అలాగే ఆయా అవయవాల్లో పేరుకుపోయే వ్యర్థాలను రక్తం బయటకు తీసుకు వస్తుంది. అందువల్ల రక్తం చాలా శుభ్రంగా ఉండాలి. రక్తంలో గ్లూకోజ్ లేదా కొవ్వులు, ఇతర పోషకాలు సరైన స్థాయిలో ఉండాలి. వ్యర్థాలు కూడా పేరుకుపోకూడదు. అందుకు గాను రక్తాన్ని శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ఇక పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తశుద్ధి జరుగుతుంది. రక్తం శుభ్రంగా మారి రోగాల నుంచి బయట పడతాము. ఇక రక్తం శుద్ధి అవ్వాలంటే అందుకు తీసుకోవాల్సిన ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.*



**వెల్లుల్లి..**

కొందరు రోజుకు తగినన్ని నీళ్లను తాగరు. దీంతో రక్తంలో వ్యర్థాలు పేరుకుపోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. రక్తం శుభ్రంగా ఉండాలన్నా, అందులోని వ్యర్థాలు బయటకు ఎప్పటికప్పుడు పోవాలన్నా నీళ్లను రోజూ తగిన మోతాదులో తాగాల్సి ఉంటుంది. అలాగే కిడ్నీలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఇక రక్త శుద్ధి జరగాలంటే రోజూ ఉదయం పచ్చి వెల్లుల్లి రెబ్బలను నేరుగా అలాగే తింటుండాలి. ఇవి ఘాటుగా ఉంటాయి కనుక చాలా మంది తినలేరు. అయితే వెల్లుల్లిని తేనెతో కలిపి తినవచ్చు. దీంతో కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. రక్తంలో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. కనుక వెల్లుల్లిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే రోజూ భోజనం చేసిన అనంతరం చిన్న బెల్లం ముక్కను తినడం వల్ల కూడా రక్తం శుద్ధి అవుతుంది. శరీరంలో రక్త సరఫరా పెరుగుతుంది. బీపీ నియంత్రణలోకి వస్తుంది.

**పసుపు..**

పసుపును మనం నిత్యం వంటల్లో ఉపయోగిస్తుంటాం. పసుపు కూడా రక్తాన్ని శుద్ధి చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. రోజూ పుసుపు టీ తాగవచ్చు. లేదా రాత్రి పూట పాలలో పసుపు కలిపి తాగినా కూడా మేలు జరుగుతుంది. అదేవిధంగా నిమ్మరసం కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. నిమ్మరసం సేవిస్తుంటే కేవలం రక్తం శుద్ధి జరగడమే కాదు లివర్, శరీరం కూడా శుభ్రంగా మారుతాయి. వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే యాపిల్స్‌ను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఇవి కూడా రక్తాన్ని క్లీన్ చేయగలవు. రక్తం తయారయ్యేలా చేస్తాయి. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

**క్యాబేజీ..**

ఆకుపచ్చని కూరగాయలు లేదా ఆకుకూరల్లో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గిస్తుంది. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తుంది. దీంతో రక్తశుద్ధి కూడా జరుగుతుంది. ఇక క్యాబేజీని కూడా ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. దీంతోనూ రక్తం శుభ్రంగా మారుతుంది. ఓట్స్, నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి శక్తి, పోషణ లభించడమే కాదు రక్తం క్లీన్ అవుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తాన్ని క్లీన్ చేసుకోవచ్చు. దీంతోపాటు కిడ్నీలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. మూత్రం సాఫీగా జారీ అవుతుంది. ఆరోగ్యంగా ఉంటారు.



## రోజు చిన్న ఎండు కొబ్బరి ముక్కను తింటే ఏం జరుగుతుందో తెలుసా..?

కొబ్బరికాయలను దేవుడికి భక్తితో సమర్పిస్తుంటారు. అయితే కొబ్బరికాయలను కొట్టిన తరువాత చాలా మంది కొబ్బరిచిప్పలను ఎండబెడుతుంటారు. అనంతరం అందులోని కొబ్బరిని వంటల్లో వాడుతుంటారు. ఇక మార్కెట్‌లో మనకు ఎండు కొబ్బరి కూడా లభిస్తుంది. వీటిని కూడా మనం వాడుతుంటాం. చాలా మంది ఎండు కొబ్బరిని మసాలా వంటకాలు లేదా స్వీట్ల తయారీలో ఉపయోగిస్తారు. అయితే వాస్తవానికి ఎండు కొబ్బరి ఎన్నో పోషకాలను కలిగి ఉంటుంది. దీన్ని రోజూ తినడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. రోజూ చిన్న ఎండు కొబ్బరి ముక్కను తిన్నా చాలు ఎంతో ప్రయోజనం ఉంటుందని వారు అంటున్నారు. రోజూ ఎండు కొబ్బరిని తినడం వల్ల ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**షుగర్ లెవల్స్..**

రోజూ చిన్న ఎండు కొబ్బరి ముక్కను తింటుంటే షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. ఎండు కొబ్బరిలో ఉండే సమ్మేళనాలు మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తాయి. దీని వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. ఫలితంగా షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. అలాగే ఎండు కొబ్బరిని తింటే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడి శుభ్రంగా మారుతుంది. ముఖ్యంగా గ్యాస్, మలబద్దకం, అసిడిటీ. కడుపు ఉబ్బరం, పొట్టలో అసౌకర్యం వంటి సమస్యలు ఉండవు. అలాగే వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి సమస్యలు ఉన్నవారు ఎండు కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది.

**రోగ నిరోధక శక్తి..**

ఎండు కొబ్బరిలో యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని తిన్నే మనకు బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ నుంచి రక్షణ లభిస్తుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గుతాయి. అలాగే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎండు కొబ్బరిని తినడం వల్ల శరీరంలో ఉండే కొవ్వు కరుగుతుంది. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. ఎండు కొబ్బరిని తినడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఫలితంగా ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఎండు కొబ్బరిని రోజూ కొద్దిగా తిన్నా చాలు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. మూత్రం సాఫీగా జారీ అవుతుంది.

**గుండె ఆరోగ్యానికి..**

ఎండు కొబ్బరిని తింటే శరీరంలోని ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) తగ్గుతుంది. హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) పెరుగుతుంది. దీంతో రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా కాపాడుకోవచ్చు. ఇక ఎండు కొబ్బరిని తింటే క్యాల్షియం, మాంగనీస్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరసిస్ సమస్య రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. ఇలా ఎండు కొబ్బరిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు. అయితే దీన్ని మరీ ఎక్కువగా తినకూడదు. రోజూ చిన్న ముక్కను తింటే చాలు, అనేక లాభాలను పొందవచ్చు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

# ఐకేపీ వీవోఏ జేఏసీ జిల్లా కమిటీ ఎన్నిక

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రుద్రమదేవి



**ములుగు, మహా :** వీవోఏ జేఏసీ జిల్లా కమిటీని ములుగు గట్టమ్మ వద్ద సోమవారం రాష్ట్ర జేఏసీ అధ్యక్షురాలు మినుముల పద్మావతి, గౌరవ అధ్యక్షురాలు అరుణల ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీవోఏ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ములుగు జిల్లా అధ్యక్షురాలుగా కొండా రుద్రమదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటాపురం మండలానికి చెందిన రోడ్డ శ్రీలత, కోశాధికారిగా ఆరె సమ్మక్కలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు రుద్రమదేవి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. వీవోఏల జాయింట్ యాక్షన్ కమిటీ కోసం అనునిత్యం పాటుపడతానని అన్నారు. ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 20 వేలు ఇవ్వాలని రుద్రమదేవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వరూపారాణి, రమాదేవి హేమలత, సత్యనారాయణ తిరుపతి, సుజాత, పద్మావతి సరోజన, లక్ష్మి, సమ్మక్క, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

## ■ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



**ములుగు, మహా:** ఈ ఏడాది చివరిరోజైన డిసెంబర్ 31న రాత్రి ములుగు జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని,బ్రీత్ అనలైజర్లతో తనిఖీలు నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవన్నారు. వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైల్ ఫోన్స్ ను పోగొట్టుకున్న బాధితులకు సీఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి తిరిగి అందజేశామని జిల్లా ఎస్పీ శబరీష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నమోదైన ఫిర్యాదులతో బాధితులు కోల్పోయిన మొబైల్ ఫోన్లను కనిపెట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో స్పెషల్ టీమ్స్ ని ఏర్పాటు చేసి గత నెల రోజుల వ్యవధిలోనే 55 మొబైల్ ఫోన్స్ ను కనిపెట్టి బాధితులకు అందజేశామన్నారు. మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లో ఆన్ లైన్ ద్వారా అడిగిన అన్ని రకాల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకుంటే సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి తిరిగి వారి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి కనిపెట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బాధితుల మొబైల్ ఫోన్స్ కనిపెట్టి వారికి అందజేయడంలో కృషి చేసిన జిల్లా పోలీస్ సీసీఎస్ ఇన్స్పెక్టర్ రమేష్, ఐటీ కోర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ములుగు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



**ములుగు, మహా:** మండలంలోని బండారుపల్లిలో సోమవారం ములుగు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ కొండి సాంబశివ సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 78 మంది గ్రామస్తులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించగా అందులో 13 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని జె తిరుమల రావు తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఈ స్క్రీనింగ్ టెస్ట్ లో కంటి ఆపరేషన్లు చేయించుటకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. వారికి హైదరాబాద్ లోని హాస్పిటల్ లో కంటి పరీక్షలు నిర్వహించి,ని తిరిగి ఇంటికి తీసుకువచ్చే బాధ్యత కూడా తమదేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి సెక్రెటరీ సోమశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జంజరాల దేవయ్య, ములుగు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మెరుగు రమేష్, సెక్రెటరీ చుంచు రమేష్, బండారుపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వారంలోగా పరిష్కారించాలి

## అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి. సంపత్ రావు





**ములుగు, మహా:** ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు వారంలోగా పరిష్కారం కావాలని అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 50 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అట్టి అర్జీలను వెంటనే పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 50 దరఖాస్తులు రాగా రెవెన్యూ శాఖలో 13, గృహ నిర్మాణ శాఖకు 07, పెన్షన్లు 03, జిల్లా ఉపాధి కల్పన అధికారి 03, ఇతరములు 24 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బూత్ కమిటీల అధ్యక్షుల నియామకం




**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 30, మహా:** బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శ్రీశైలం ఆధ్వర్యంలో బూత్ కమిటీలకు అధ్యక్షులను నియమించారు. ఇబ్రహీంపట్నం మండలం రాచకొండ దండుమైలారంలో సోమవారం బూత్ కమిటీల అధ్యక్షులుగా గాజంగం వెంకట్ రెడ్డి, చింతల కృష్ణ మురుదిరాజ్, పొట్లచెరువు మధు కుమార్ రజక, ఉదారి శివకుమార్ ముదిరాజ్, తుంకోజి మమతలను నియమించారు.పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం బీజేపీ మండల అధ్యక్షులు దండే శ్రీశైలం యాదవ్, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యులు తుంకోజు సాయికుమార్ చారి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఓబీసీ మోర్చా కన్వీనర్ రమేష్ చారి, సీనియర్ నాయకులు నరసింహ ముదిరాజ్, పట్నం శ్రీశైలం, గణేష్ రజక, శివ కుమార్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యూ ఈయర్ వేడుకలు హ్యాపీగా జరుపుకోవాలి

## ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండరాదు.. డ్రగ్స్ వినియోగించరాదు

## జిల్లా ఎస్పీ గౌష్ ఆలం సూచన



**ఆదిలాబాద్, మహా:** 2025 నూతన సంవత్సర వేడుకలను జిల్లా వ్యాప్తంగా సంతోషాల నడుమ, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో సూచించారు. అర్ధరాత్రి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేసి నిరంతరంగా గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన పలు సూచనలు చేషారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 కు సమాచారం అందించాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమాలు రాత్రి 12 30 గంటల తర్వాత కొనసాగితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు నమోదు చేస్తామని, వారి వల్ల ఏదైనా ప్రమాదం సంభవించినట్లయితే సంరక్షణకుల పైన కేసులు నమోదయితాయని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీన డీజేలకు, అధికంగా శబ్దం చేసి సౌండ్ సిస్టంలకు అనుమతులు లేవని నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, అదేవిధంగా రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, బైక్ రేసింగ్ లాంటి వాటికి పాల్పడరాదన్నారు. నూతన సంవత్సర వేడుకలలో నిషేధిత డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలను విక్రయించిన, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, ఇబ్బంది పెట్టినవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో, ప్రభుత్వ స్థలాలలో మద్యం సేవించినట్లయితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయాలలో మూసివేయాలని, మైనర్లకు మద్యం అమ్మకూడదని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయినా నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ప్రజలందరికి పోలీసు సిబ్బందికి, అధికారులకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, సూచించిన నియమ నిబంధనలను పాటించి పోలీసు వ్యవస్థకు సహకరించాలని సూచించారు.

# పూసాయి ఎల్లమ్మ జాతరకు సర్వం సిద్ధం



**ఆదిలాబాద్, మహా:** జైనథ్ మండలంలోని ప్రసిద్ధ పూసాయి ఎల్లమ్మ తల్లి జాతర వేడుకలకు సర్వం సిద్ధమయింది. ప్రతియేటా పుష్య మాస అమావాస్య నుండి నెల రోజులపాటు జాతర జరగడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం నుండి జాతర ప్రారంభం కాగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆనవాయితీ ప్రకారం జాతర ప్రారంభం సందర్భంగా పూసాయి గ్రామస్తులు మహిళలు అమ్మవారికి సాముహిక బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానవీధుల గుండా డప్పు చప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించిన అనంతరం ఆలయానికి చేరుకున్న మహిళలు..అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక జాతరను పురస్కరించుకుని జిల్లాతోపాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర నుండి సైతం వేలాదిగా భక్తులు తరలివచ్చి ఆలయాన్ని దర్శించుకుంటారు. ముఖ్యంగా ఆది, మంగళ, బుధ వారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇందుకుగానూ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తులు స్నానం ఆచరించడానికి కోనేరును సిద్ధం చేసారు.. అందులో స్నానం చేస్తే చర్మ వ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం. భక్తులు ఇంటిల్లిపాది వచ్చి ఇక్కడే పిండి వంటలు తయారు చేసి..అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. పూసాయిలో నెల రోజులపాటు జరిగే జాతర వేడుక సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పూర్తి ఏర్పాట్లు చేశారు.

# ఎస్సీ వర్గీకరణతోనే న్యాయం

## ఎమ్మార్పీఎస్ నాయకులు వెల్లడి..జైనథ్ మండల కమిటీ ఎన్నిక



**ఆదిలాబాద్, మహా:** ఎస్సీ వర్గీకరణ జరిగితే ఏ కులానికి అన్యాయం జరగదని, జనాభా ప్రాతిపదికన ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు రిజర్వేషన్లు లభించి న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి బుర్రి సతీష్ మాదిగ అన్నారు. జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ అధ్యక్షతన మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణం, బలోపేతంలో భాగంగా జైనథ్ మండల కేంద్రంలో మండల సదస్సు నిర్వహించగా కార్యక్రమానికి సతీష్ హాజరయ్యారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 3న జరిగే వెయ్యి గొంతులు...లక్ష డప్పుల ప్రదర్శన కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తమ పోరాటం న్యాయమైంది కనుకనే సమాజం మొత్తం మద్దతు ఇచ్చిందని అన్నారు. కానీ మాలలు తమకున్న రాజకీయ పలుకుబడితో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి బలంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అణగారిన ప్రజలకు కవులు కళాకారులు అండగా నిలబడాలని అన్నారు. మాల మహానాడు మీటింగ్ పేరుతో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం కోసం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చేస్తున్న ప్రయత్నాలను తప్పుపట్టారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ అధ్యక్షతన జైనథ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు మండల ఇంచార్జ్ దుమాల స్వామి, అల్లగొండ రవి, కోడిచెర్ల ఆశన్న, వేంపెల్లి గోవర్ధన్, సందూరి వినయ్ సాగర్, కొడిచెర్ల లస్మన్న , గంగన్న, ఆశన్న ,అశోక్ ,పోచన్న, లింగన్న, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో ప్రజావాణి కార్యక్రమం



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 30, మహా:** ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ అర్జీలను ఆర్డీఓ అనంతరెడ్డికి అందించడం జరిగింది. ఇచ్చిన సమస్యల పట్ల తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఆయా శాఖల అధికారులకు బదిలాయించడం జరిగిందని ఆర్డీఓ తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో సునీత, ఎంపీడీవో వెంకటమ్మ, పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి

- సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి
- ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 30, మహా:** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-31, పీడీ హౌసింగ్ -10, డీపీఓ 02, మున్సిపల్02, ల్యాండ్ ప్రొటెక్షన్ 02, విద్యుత్తు 01, ఎండోమెంట్ -02, మొత్తం 50 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమిత్‌షా ను బర్తరఫ్ చేయాలి

## వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన




**ఆదిలాబాద్, మహా:** నిండు పార్లమెంటులో బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని సీపీఎం, సీపీఐ , సీపీఎం(ఎల్) మాస్ లైన్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో దేశవ్యాపిత ఆందోళనలో భాగంగా స్థానిక అంబేద్కర్ చౌక్ లో నిరసన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, మాస్ లైన్ జిల్లా నాయకులు జగన్ సింగ్, సీపీఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వెంకట్ నారాయణ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని అంగీకరించని ఆర్ఎస్ఎస్ కుట్రలో భాగమే అమిత్ షా వ్యాఖ్యలంటూ మండిపడ్డారు. భారత రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని తీసుకురావాలన్న ప్రయత్నంలో భాగంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనేకసార్లు రాజ్యాంగాన్ని, అంబేద్కర్ ను అవహేళన చేశాయన్నారు. బ్రాహ్మణ వాద అగ్రవర్ణ ఆధిపత్య భావజాలాన్ని దేశంపై రుద్దడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. భారత రాజ్యాంగ రక్షకులు, ప్రజాస్వామిక వాదులు అమిత్ షాను తొలగించేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్ మంజుల, ఆర్ సురేందర్, ఎం. గంగన్న, లంక జమున, ఎన్. స్వామి, సీపీఐ జిల్లా నాయకులు కృష్ణ స్వామి, చిల్క దేవిదాస్, చంద్రమౌళి, మెస్రం భాస్కర్, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు సురేష్, సాయి, సీపీఎం న్యూడెమోక్రసీ నాయకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల అభ్యున్నతికి కృషి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ సంపత్



**ములుగు, మహా:** మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందించి, వారి అభ్యున్నతికి కృషి చేయాలని ములుగు జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్ రావు సూచించారు. మండల కేంద్రంలోని నవభారతి మండల సమాఖ్య కార్యాలయంలో వీఏఓల రివ్యూ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సంఘంలో లేని సభ్యులందరినీ సంఘంలో చేర్పించాలని, ప్రతి గ్రామంలో ఎఫ్ పీజీ (ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ గ్రూప్ )లు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో పాల ఉత్పత్తులను పెంచడానికి మహిళా సంఘ సభ్యులకు రుణాలు అందించి పాడి గేదెలు కొనుగోలు చేసేలా చూడాలన్నారు. పెరటి కోళ్ల పెంపకంపై అందరికీ అవగాహన కల్పించాలని, గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెంచాలని సూచించారు. అనంతరం నూతన సంవత్సర వేడుకల్లో ముందస్తుగా కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్యాలయ సిబ్బంది అదనపు కలెక్టర్ కు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సతీష్, ఏపీఎం మహమ్మద్ పాషా, సీసీలు జవహర్, చంద్రమౌళి, సాంబయ్య, భీమా, లక్ష్మి, విజయ, సునీత, వీఏఓలు తదితరులు పాల్గొన్నారు.

# కారు ఢీకొని యువకుడి మృతి




**ములుగు, మహా:** ములుగు జవహర్ నగర్ సమీపంలోని గట్టమ్మ టెంపుల్ హరిత కాకతీయ హోటల్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. గోవిందరావుపేట నుండి ములుగుకు వెళుతున్న కారు ములుగు నుండి పస్రా వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నందికొండూరు సతీష్ బాబు (33) అక్కడికక్కడే మృతిచెందాడు. కారు వేగంగా వచ్చి బైక్ ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

# నిర్మల్ పోలీస్.. మీ పోలీస్ ఎస్పీ జానకి షర్మిల




**నిర్మల్, మహా:** నిర్మల్ జిల్లా 2023 2024 వార్షిక క్రైమ్ రిపోర్ట్ ను జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరించారు. నిర్మల్ పోలీస్ మీ పోలీసు అనే ఈ కొటేషన్ ద్వారా నిర్మల్ ప్రజలకు చేరువయ్యామన్నారు. అనేక సమస్యల పరిష్కారం కోసం నిర్మల్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే క్రైమ్ రేట్ కేసు నమోదులు పెరిగాయని అదే రీతిలో కేసుల పరిష్కారం కూడా జరిగిందని అన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు డాగ్ స్క్వాడ్ ద్వారా కృషి చేస్తున్నామని, జిల్లాలో బాసర వద్ద గోదావరి నదిలో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. బాసర ట్రిబుల్ ఐటీని దత్తత తీసుకొని వాటిలోని సమస్యలను పరిష్కరించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామన్నారు. భరోసా సెంటర్ ద్వారా విడిపోయిన 50 గంటలకు పైగా కలిపి ఆ కుటుంబాలలో సంతోషాలు నింపామని, జిల్లాలో ట్రాఫిక్ సమస్య నిమిత్తం నిర్మల్, భైంసాలలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్లో మహిళ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపామని, అవి త్వరలోనే కార్యరూపం దాలుస్తాయని అన్నారు. పోలీసు ఉద్యోగుల సంక్షేమం కోసం డిపార్ట్మెంటల్ స్టోర్, దానితోపాటు ఉద్యోగుల అవసరాల నిమిత్తం వడ్డీ లేకుండా మూడు లక్షల రూపాయల రుణాలు ఇచ్చి ఆదుకుంటున్నామన్నారు. జిల్లాలో సైబర్ క్రైమ్ నేరాల ద్వారా నష్టపోయిన బాధితులకు రూ. 12 లక్షల మేర రికవరీ చేసి వారికి అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## సీఎం ఆదిత్యనాథ్ నివాసం కింద శివలింగం ఉంది: అఖిలేష్ యాదవ్



**లక్నో:** ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికార నివాసం కింద శివలింగం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ కూడా తవ్వకాలు జరుపాలని ఆయన డిమాండ్ చేశారు. కొన్ని రోజుల కిందట సంభాల్‌లో మొఘల్ కాలం నాటి మసీదు సర్వే నేపథ్యంలో అల్లర్లు జరిగాయి. ఈ ఘర్షణలో పలువురు మరణించగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాత సంభాల్‌లో పలు చోట్ల తవ్వకాలతోపాటు ఇళ్ల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కాగా, అఖిలేష్ యాదవ్ సోమవారం దీని గురించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలు కప్పిపుచ్చడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి పలు ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతోందని ఆయన విమర్శించారు. అమాయకుల ఇళ్లను బుల్డోజర్లతో అక్రమంగా కూల్చివేస్తున్నారని ఆరోపించారు. 'సీఎం అధికార నివాసం కింద కూడా శివుడి రూపాన్ని సూచించే స్థూపాకార శివలింగం ఉందని మేం భావిస్తున్నాం. అక్కడ కూడా తవ్వకాలు జరుపాలి' అని అన్నారు.

మరోవైపు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం శివలింగం గురించి ఇలా మాట్లాడటం సిగ్గుచేటని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు.

## 160,000 టెంట్లు, 150,000 టాయిలెట్లు, 1,250 కి.మీ. పైప్‌లైన్

### మహాకుంభ్‌కు అంతా సిద్ధం



**మహాకుంభ్‌నగర్:** జనవరి 13వ తేదీ నుంచి ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా జరగనున్నది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. గంగా, యమునా, సరస్వతీ నదీ సంగమ ప్రదేశంలో జరిగే మహాకుంభ్‌కు లక్షల సంఖ్యలో జనం హాజరుకానున్నారు. పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తులకు భారీ ఏర్పాట్లు చేశారు. రోడ్లు వెడల్పు చేసి, ఘాట్లను సమం చేసి, నది వద్ద టెంట్లు ఏర్పాటు చేసే అంశంలో కార్మికులు ఓ సైన్యంలా పనిచేస్తున్నారు.

ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌లో దీనిపై మాట్లాడారు. ఐకమత్యానికి మహాకుంభ్ అని మోదీ ఆ ఈవెంట్‌ను వర్ణించారు. మహాకుంభ్ నుంచి తిరిగి వెళ్తూ.. ద్వేష, విభజన భావాన్ని వీడాలని సందేశం ఇచ్చారు. మహాకుంభ్ కా సందేశ్.. ఏక్ హో పూరా దేశ్ అని మోదీ అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభ్.. వచ్చే ఏడాది జనవరి 13వ తేదీన పౌశ పున్నమి రోజున ప్రారంభంకానున్నది. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో మహాకుంభ్ ముగుస్తుంది.

ఆ పవిత్ర సమయంలో నదీ స్నానం చేసేందుకు దేశం నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు ప్రయాగ సంగమం వద్దకు చేరుకుంటారు. ఈ ఏడాది మహాకుంభ్ సమయంలో సుమారు 40 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేస్తున్నారు. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. సుమారు లక్షా 50వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్‌ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు.

సులభ స్నానాల కోసం తొమ్మిది పేవ్మెంట్ ఘాట్లు, ఏడు రివర్‌ఫ్రంట్ రోడ్డు, 12 కిలోమీటర్ల తాత్కాలిక ఘాట్లను నిర్మిస్తున్నారు. ఏడు బస్టాండ్లను నిర్మిస్తున్నారు. ఆ ప్రాంతాన్ని సర్వాంగసుందరంగా తీర్చేందుకు స్ట్రీట్ పెయింటింగ్స్ చేస్తున్నారు.

గత కొన్నేళ్ల నుంచి ప్రయాగ్‌రాజ్‌లో నదీ పరివాహక ప్రాంతం తగ్గిపోయింది. సుమారు 3200 ఎకరాల నదీ స్థలం ఆక్రమణకు గురైంది. కానీ ఆ స్థలాన్ని తిరిగి చేజిక్కించుకున్న ప్రభుత్వం దాదాపు 4 వేల హెక్టార్లలో ఏర్పాట్లు చేస్తున్నది. ఆర్థిక లావాదేవీలు స్మూత్‌గా సాగేందుకు అనేక ప్రాంతాల్లో బ్యాంకులు, ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. హెల్త్‌కేర్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

వంద బెడ్లతో సెంట్రల్ ఆస్పత్రిని సెటప్ చేస్తున్నారు. రెండు 20 పడకల సబ్ సెంటర్ ఆస్పత్రులను, 25 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 125 అంబులెన్సులు అందుబాటో ఉంటాయి. రాయ్‌బరేలీలోని ఎయిమ్స్ వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. మతపరమైన అకాడాలకు కూడా ప్రత్యేక టెంట్లను కేటాయించారు.


## ప్రశాంత్ కిశోర్‌కు చుక్కెదురు



**పాట్నా:** బీపీఎస్సీ పరీక్షను మళ్లీ నిర్వహించాలనే డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో బీహార్ లో రాజకీయ దుమారం చెలరేగింది. పాట్నాలోని గార్దానీబాగ్‌లో ఆదివారం సమావేశానికి పిలుపునిచ్చిన ప్రశాంత్ కిషోర్‌పై అభ్యర్థులు సీరియస్ అయ్యారు. లాఠీచార్జ్ తరువాత పరామర్శకు వచ్చిన ఆయనతో వాగ్వాదానికి దిగారు. అక్కడి నుంచి ప్రశాంత్ కిశోర్ వెళ్లిపోవాలంటూ వారు డిమాండ్ చేశారు. ప్రశాంత్ కిషోర్ గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. దీంతో ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ... మీకు దుప్పట్లు ఇచ్చాను.. అలాంటి తననే విమర్శిస్తున్నారంటూ పేర్కొనడంతో అభ్యర్థులు సీరియస్ అయ్యారు. మీరు మాకు దుప్పట్లు ఇచ్చారు కానీ, ఆ తరువాత మీ వైఖరేంటో తమకు స్పష్టంగా అర్థమైందంటూ పేర్కొన్నారు. దీంతో చేసేదేమీ లేక ప్రశాంత్ కిశోర్ అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థులపై లాఠీచార్జ్ చేయడం సరికాదన్నారు. పాట్నా పోలీసులపై కేసు నమోదు చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా అభ్యర్థుల డిమాండ్ చేస్తున్న బీపీఎస్సీ పరీక్షను మళ్లీ నిర్వహించాలనే వాదానతో తాను ఏకీభవిస్తున్నట్లు చెప్పారు. లేనిపక్షంలో అభ్యర్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలియజేయాల్సి వస్తుందన్నారు.

## అర్చకులకు రూ.18 వేల గౌరవవేతనం..


### రేపటినుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియ : కేజ్రీవాల్ ప్రకటన



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజలను ఆకట్టుకునేందుకు కీలక హామీలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కీలక ప్రకటన చేశారు. ఆలయాలు, గురుద్వారాల్లో పనిచేసే పూజారులు, గ్రంథీలకు కేజ్రీ వరాల జల్లు కురిపించారు. తాము అధికారంలోకి వస్తే.. వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందజేస్తామని ప్రకటించారు. సోమవారం కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ.. 'పురోహితులు, గ్రంథీలు మన ఆచారాలను భవిష్యత్తు తరాలకు అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సమాజానికి వారు నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోవడం లేదు. మేం అధికారంలోకి వస్తే వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందిస్తాం' అని కేజ్రీవాల్ అన్నారు. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రేపటి నుంచే ప్రారంభం అవుతుందని కేజ్రీ వెల్లడించారు. హనుమాన్ ఆలయంలో తానే స్వయంగా ఈ ప్రక్రియను ప్రారంభిస్తానని తెలిపారు. ఈ ప్రక్రియకు అడ్డుపడొద్దని ఈ సందర్భంగా బీజేపీని కేజ్రీ అభ్యర్థించారు. 'రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అడ్డంకులు సృష్టించవద్దని నేను బీజేపీని అభ్యర్థిస్తున్నాను. దీన్ని అడ్డుకోవడం పాపం చేసినట్లే అవుతుంది' అని వ్యాఖ్యానించారు.

## యమునా నదిలో మన్మోహన్ సింగ్ అస్తికలు

### కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు



**ఢిల్లీ:** మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అస్తికలను కుటుంబ సభ్యులు యమునా నదిలో కలిపారు. మజ్ను కా తిలా గురుద్వారా సమీపంలో ఉన్న అష్ట్ ఘాట్ వద్ద సిక్కు సంప్రదాయాలను అనుసరిస్తూ ఆదివారం ఆయన ఆస్తికలను కుటుంబ సభ్యులు నదిలో నిమజ్జనం చేశారు. ఇదిలా ఉంటే.. మన్మోహన్ సింగ్ స్మారక నిర్మాణం విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో స్మారకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. అందుకు సంబంధించి స్థలం విషయమై త్వరలోనే నిర్ణయిస్తామంటూ స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే.. స్మారక నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.


## కాళ్లు పట్టుకుంటే పనులు జరగవు

### వినూత్న బోర్డు పెట్టిన కేంద్ర మంత్రి



ప్రజలకు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ కీలక విజ్ఞప్తి చేశారు. పాదాలను తాకడంపై నిషేధం ఉందని.. అలా చేసిన వారికి పనులు అప్పగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మధ్యప్రదేశ్‌లోని తికమ్‌గఢ్ లోగల తన కార్యాలయం వద్ద వినూత్న బోర్డు ఏర్పాటు చేశారు. 'పాదాలను తాకడంపై నిషేధం ఉంది. అలా చేసిన వారికి ఎటువంటి పనులూ అప్పగించేది లేదు' అంటూ పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఇది చూసిన స్థానిక ప్రజలు, రాజకీయ నేతలు షాక్ అవుతున్నారు. కార్యాలయం వద్దకు వచ్చిన వారంతా ఈ బోర్డును ఆసక్తిగా తిలకిస్తున్నారు. కేంద్ర మంత్రి చేసిన ఈ పనిని ప్రశంసిస్తున్నారు. కాగా, వీరేంద్ర కుమార్‌కు స్థానికంగా ఓటమి ఎరుగని నాయకుడిగా పేరుంది. ఆయన 1996లో తొలిసారి సాగర్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇక తికమ్‌గఢ్ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం నుంచి 2009లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2019లో ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇప్పుడు 2024లోనూ అదే విజయ పరంపర కొనసాగించారు. ప్రస్తుతం ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా పనిచేస్తున్నారు.

## పీఎస్ఎల్వీ-సీ60 ప్రయోగం విజయవంతం..!



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో).. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరి కోట నుంచి ఉపగ్రహ వాహక నౌక పీఎస్ఎల్వీసీ60 సోమవారం రాత్రి నింగిలోకి దూసుకెళ్లింది. రెండు చిన్న ఉపగ్రహాలను మోసుకుంటూ వెళ్లిన పీఎస్ఎల్వీసీ 60 ప్రయోగం భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలకు కీలకం కానున్నది. స్పేస్ డాకింగ్ లక్ష్యంగా పీఎస్ఎల్వీసీ 60 ప్రయోగం జరిగింది. 2035 నాటికి చంద్రుడిపై సొంతంగా స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేసుకోవడమే లక్ష్యంగా ఇస్రో కదులుతోంది. ఇందులో భాగంగా పీఎస్ఎల్వీసీ60 తాను మోసుకెళ్లిన రెండు ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి పంపింది. స్పేస్ డాకింగ్ చేయగల సామర్థ్యం గల రెండు ఉపగ్రహాల ప్రయోగం విజయవంతమైందని ఇస్రో ప్రకటించింది. భూ ఉపరితలం నుంచి 470 కి.మీ ఎత్తున వృత్తాకార కక్ష్యలో రెండు వ్యోమ నౌకలు స్వతంత్రంగా ఒకేసారి డాకింగ్ అయ్యేలా ఇస్రో శాస్త్రవేత్తలు ప్లాన్ చేశారు. సొంత అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి వ్యోమ నౌకల డాకింగ్, అన్ డాకింగ్ టెక్నాలజీ అవసరం అని ఇస్రో వెల్లడించింది. ఈ ప్రయోగం విజయవంతమైతే స్పేస్ డాకింగ్ టెక్నాలజీ కల నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది. ఇప్పటికే అమెరికా, రష్యా, చైనాలకు ఈ టెక్నాలజీ అందుబాటులో ఉంది.

## గంటకు 450 కి.మీ. హైస్పీడ్ రైలు

### నమూనాను ఆవిష్కరించిన చైనా
### ప్రపంచంలోనే అత్యంత వేగంగా పరిగెత్తే రైలు



**చైనా:** నూతన ఆవిష్కరణతో ప్రపంచం చూపును ఇప్పుడు తనవైపు తిప్పుకుంది చైనా దేశం. అత్యంత వేగంగా పరిగెత్తే హైస్పీడ్ బుల్లెట్ రైలు నమూనాను తాజాగా చైనా ఆవిష్కరించింది. ఈ బుల్లెట్ రైలు గంటకు 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. బుల్లెట్ ట్రైయిన్ ను మరింతగా ఆధునీకరించి, ఫైనల్‌గా ఈ హై స్పీడ్ రైలును తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రైలుతో ప్రయాణికుల రైలు ప్రయాణం మరింత సుగుమం అయ్యిందంటూ చైనా వెల్లడించింది.

## వంట గదులకు కిటికీలు వద్దు

### తాలిబన్ల కొత్త వింత రూల్



ఆఫ్ఘానిస్థాన్ ను తాలిబన్లు తమ ఆధీనంలోకి తీసుకున్న తరువాత అక్కడి పరిస్థితులను పూర్తిగా మార్చివేస్తున్నారు. అంతకుముందు మంచి పాలన అందిస్తామని ప్రకటించిన తాలిబన్లు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మహిళల పరిస్థితి అయితే అత్యంత దారుణంగా ఉంది. వారి పట్ల కఠినాదికఠినంగా వ్యవహరిస్తున్నారు. వారి హక్కులను పూర్తిగా కాలరాస్తూ అణిచివేస్తున్నారు. 2021 ఆగస్టులో తాలిబన్లు ఆఫ్ఘాన్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి కొత్త కొత్త రూల్స్ ను తీసుకువస్తూ ప్రజలను హింసిస్తున్నారు. మహిళలు ఉద్యోగాలు చేయకూడదనే నిబంధనను మొదటగా పెట్టారు. ఆ తరువాత బాలికల సెకండరీ స్కూళ్లను మూసివేశారు. మహిళలు పురుషులు వెంట లేకుండా బయటకు రావొద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా మహిళలు ఉన్నత చదువులు చదువుకోవొద్దంటూ నిషేధం విధించారు. ఈద్ వేడుకల్లో పాల్గొనకుండా నిషేధం విధించారు. వీటితోపాటు పార్కులు, జిమ్‌లల్లో మహిళలు పాల్గొనవద్దంటూ నిషేధం కొనసాగిస్తున్నారు. తాజాగా మరో రూల్ ను తీసుకువచ్చారు. ఇంట్లోని మహిళలు బయటకు కనిపించకుండా ఉండేందుకు కిటికీలను ఏర్పాటు చేయెుద్దనే రూల్ ను తీసుకువచ్చారు. కొత్త నిర్మించబోయే ఇళ్లల్లో ఈ రూల్ ను ఖచ్చితంగా ఫాలో కావాల్సిందేననే నిబంధన పెట్టారు. వంట గదులు, బావుల వద్ద కిటికీలను ఏర్పాటు చేయెుద్దంటూ తాలిబన్లు ఆదేశాలు జారీ చేశారు. మహిళలు కనిపించకుండా గోడలు కట్టుకోవాలంటూ ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. పాత నిర్మాణాలకు కూడా ఈ కొత్త రూల్ ను పాటిస్తూ మార్పులు చేర్పులు చేసుకోవాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే.. మహిళలపై దమన కాండను మోగిస్తున్న తాలిబన్ల ఐక్యరాజ్య సమితి ఇప్పటికీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా తీసుకువచ్చిన ఈ రూల్ పై కూడా యూఎన్ఓ తీవ్ర అభ్యంతరం తెలిపింది.

## యూఎస్ మాజీ ప్రెసిడెంట్ కన్నుమూత

- రైతు కుటుంబం నుంచి అమెరికా అధ్యక్షుడిగా
- పదవీ బాధ్యతల తరువాత ఎన్నోమార్పులకు శ్రీకారం
- జిమ్మీ కార్డర్ మృతిపట్ల ప్రముఖుల సంతాపం



**యూఎస్:** అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్డర్ కన్నుమూశారు. ప్రస్తుతం డెమొక్రటిక్ పార్టీ సభ్యునిగా కొనసాగుతున్న ఆయన అనారోగ్య కారణాలతో జార్జియాలోని ప్లెయిన్స్ లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గత రెండు నెలల క్రితమే ఆయన తన వందవ పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. అమెరికాకు కార్డర్ 39వ అధ్యక్షునిగా కొనసాగారు. అదేవిధంగా అత్యున్నత పురస్కారం నోబెల్ శాంతి పురస్కారాన్ని కూడా ఆయన 2002లో అందుకున్నారు. అక్టోబర్ 1, 1924లో రైతు కుటుంబంలో జన్మించిన ఆయన అమెరికాలో కొనసాగుతున్న జాత్యాహంకారాన్ని చూసి తట్టుకోలేక రాజకీయాల్లోకి వచ్చారు. ఆ తరువాత జార్జియా రాష్ట్రానికి గవర్నర్ గా ఎన్నికయ్యారు. అమెరికా ప్రెసిడెంట్ గా కూడా కార్డర్ ఎన్నికై ఆ దేశంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. పర్యావరణ పరిరక్షణ, మానవ హక్కుల పరిరక్షణకు ఆయన ఎంతో కృషి చేశారు. జిమ్మీ కార్డర్ మృతిపట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తో పాటు పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన సేవలను కొనియాడుతున్నారు.

## ఆసుపత్రిలో చేరిన ఇజ్రాయెల్ ప్రధాని

### నెతన్యాహు ఆపరేషన్ చేసిన వైద్యులు



**జెరూసలెం:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారంటూ వైద్యులు వెల్లడించారు. అయితే, ఆయన మరికొన్ని రోజులు తమ అబ్జర్వేషన్లోనే ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, నెతన్యాహు గత కొంతకాలంగా ప్రోస్టేట్ గ్రంథి సమస్యతో బాధపడుతున్న విషయం విధితమే. ఈ సమస్య కారణంగా మూత్ర నాళం ఇన్ ఫెక్షన్ కు గురైంది. ఈ క్రమంలోనే ఆయనకు వైద్యులు ఆదివారం శస్త్ర చికిత్స చేశారు. జెరూసలెంలోని హడస్సా ఆసుపత్రిలో ఈ సర్జరీ చేశారు. సర్జరీ అనంతరం వైద్యులు వివరాలను వెల్లడించారు. శస్త్ర చికిత్స విజయవంతమైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా నిలకడగానే ఉందని చెప్పారు.

## పంజాబ్ బంద్ విజయవంతం

### భారీగా పాల్గొన్న రైతులు
### తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్



**పంజాబ్:** రైతుల ఆందోళనలతో పంజాబ్ పూర్తిగా స్తంభించిపోయింది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పంజాబ్ రైతులు ఆ రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ ను నిర్వహించాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా పిలుపునిచ్చాయి. ఈ బంద్ లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు ఈ బంద్ కారణంగా రాష్ట్రం మొత్తం స్తంభించిపోయింది. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు మూతపడ్డాయి. రోడ్డు, రైళ్లు మార్గాలను రైతులు పూర్తిగా దిగ్బంధించడంతో రైళ్లు, వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో రవాణా సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బంద్ లో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు.

## తమిళనాడు గవర్నర్ ను కలిసిన నటుడు విజయ్ వినతి పత్రం అందజేత



**చెన్నై:** తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాన్ని టీవీకే పార్టీ అధ్యక్షుడు, సినిమా హీరో విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిందని, వెంటనే శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ మేరకు ఆయన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా తమిళనాడులో ఇటీవలే తీవ్ర ప్రభావం చూపిన ఫెంగాల్ తుఫాన్‌కు సంబంధించి కూడా గవర్నర్ తో చర్చించారు. ఫెంగాల్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో చాలామంది సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారని, వారికి ఎటువంటి సహాయం అందలేదంటూ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే నిధులను విడుదల చేసేలా చొరవ తీసుకోవాలంటూ గవర్నర్ ను కోరారు.

## ఈ 5 కార్లు రూ.7 లక్షల కంటే తక్కువ ధరల్లో..

# 25 కి.మీ మైలేజీ!




### మారుతి సుజుకి స్విఫ్ట్

మారుతి సుజుకి మైలేజ్ పరంగా చాలా మంచి కారు. కొత్త తరం మారుతి సుజుకి స్విఫ్ట్ ధర రూ. 6.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్) నుండి ప్రారంభమవుతుంది. దీని మాన్యువల్ గేర్‌బాక్స్ వేరియంట్ 24.8 Kmpl మైలేజీని ఇస్తుంది. ఆటోమేటిక్ మోడల్ 25.75 Kmpl మైలేజీని ఇస్తుంది. ఇది 1.2లీటర్ మూడుసిలిండర్ Z సిరీస్ ఇంజిన్‌ను కలిగి ఉంది. ఇది 5700 rpm వద్ద 80.4 bhp, 4300 rpm వద్ద 113 Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.

### మారుతి సుజుకి స్విఫ్ట్

మారుతి సుజుకి మైలేజ్ పరంగా చాలా మంచి కారు. కొత్త తరం మారుతి సుజుకి స్విఫ్ట్ ధర రూ. 6.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్) నుండి ప్రారంభమవుతుంది. దీని మాన్యువల్ గేర్‌బాక్స్ వేరియంట్ 24.8 Kmpl మైలేజీని ఇస్తుంది. ఆటోమేటిక్ మోడల్ 25.75 Kmpl మైలేజీని ఇస్తుంది. ఇది 1.2లీటర్ మూడుసిలిండర్ Z సిరీస్ ఇంజిన్‌ను కలిగి ఉంది. ఇది 5700 rpm వద్ద 80.4 bhp, 4300 rpm వద్ద 113 Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.






### మారుతి సుజుకి స్విఫ్ట్

మారుతి సుజుకి మైలేజ్ పరంగా చాలా మంచి కారు. కొత్త తరం మారుతి సుజుకి స్విఫ్ట్ ధర రూ. 6.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్) నుండి ప్రారంభమవుతుంది. దీని మాన్యువల్ గేర్‌బాక్స్ వేరియంట్ 24.8 Kmpl మైలేజీని ఇస్తుంది. ఆటోమేటిక్ మోడల్ 25.75 Kmpl మైలేజీని ఇస్తుంది. ఇది 1.2లీటర్ మూడుసిలిండర్ Z సిరీస్ ఇంజిన్‌ను కలిగి ఉంది. ఇది 5700 rpm వద్ద 80.4 bhp, 4300 rpm వద్ద 113 Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.




## తగ్గిన బంగారం ధర..

# హైదరాబాద్‌లో తులం ఎంతంటే?

బంగారం, వెండి ధరల్లో నిత్యం మార్పులు చోటు చేసుకుంటుంటాయి. ఓరోజు పెరిగితే, మరో రోజు తగ్గుతుంటాయి. గత నాలుగు రోజులుగా పెరిగిన బంగారం, వెండి ధరలు సోమవారం నాడు తగ్గాయి. దీంతో వినియోగదారులకు బిగ్ రిలీఫ్ ఇచ్చాయి. అయితే, ఆదివారంనాడు 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 71,350లుగా నమోదైంది. అలాగే, 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 77,840గా నమోదైంది. ఇక వెండి ధర విషయానికొస్తే ఆదివారం కిలో వెండి ధర రూ. 92,600గా ఉంది. నేడు అంటే, సోమవారం నాడు 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 71,340లుగా నమోదైంది. అలాగే, 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 77,830గా నమోదైంది. ఇక వెండి ధర విషయానికొస్తే ఆదివారం కిలో వెండి ధర రూ. 92,500గా నమోదైంది.

ఇక హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.71,340 కాగా.. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.77,830గా ఉంది. విశాఖపట్నం, విజయవాడలోనూ ఇదే ధర కొనసాగుతోంది. అటు దేశ రాజధాని న్యూఢిల్లీలో మాత్రం 22 క్యారెట్ల పసిడి ధర రూ.71,490 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 77,849గా ఉంది.

వెండి ధరలు విషయానికొస్తే.. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో కిలో వెండి రూ. 99,800 ఉండగా.. ముంబైలో రూ. 92,500లు కాగా, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరులో కేజీ వెండి ధర రూ. 92,300గా నమోదైంది. ఇక మీరు తాజాగా నమోదైన బంగారం ధరలను తెలుసుకునేందుకు, 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.




## ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా పన్ను వసూలు చేయని దేశాలు


# ఏవో తెలుసా?

**పన్ను చెల్లించాల్సిన అవసరం లేని దేశాలు ప్రపంచంలో చాలా ఉన్నాయి. అంటే మీరు సంపాదించిన ప్రతిదానిపై మీ ప్రభుత్వం పన్ను విధించదు. కార్పొరేట్ కంపెనీలు కూడా ఈ దేశాల్లో పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రజలు పన్నులు కట్టకపోతే దేశం ఎలా నడుస్తుందన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది. ఈ దేశాల గురించి, వాటి ఆర్థిక వ్యవస్థ ఎలా పనిచేస్తుందో తెలుసుకుందాం.**



మీడియా నివేదికల ప్రకారం.. ఈ దేశాలు ఆదాయం కోసం పర్యాటకానికి భారీగా మద్దతు ఇస్తున్నాయి. ఈ దేశాల నుండి పర్యాటకులు తిరిగి వచ్చినప్పుడు, వారికి రిటర్న్ ట్యాక్స్ కూడా వసూలు చేస్తారు. 2024 సంవత్సరానికి సంబంధించి టాప్ ట్యాక్స్ ఫ్రీ దేశాల జాబితా విడుదలైంది. ఈ దేశాల్లోని ప్రజలు దాదాపు తమ కష్టార్జిత డబ్బును ఉంచుకుని పన్ను రహిత జీవితాన్ని గడపవచ్చని అందులో పేర్కొన్నారు. నివేదికల ప్రకారం.. ఈ 9 దేశాల్లో మీ ఆదాయాలపై పన్ను విధించరు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహామాస్, ఖతార్, వనాటు, బహ్రెయిన్, సోమాలియా, బ్రూనై, బహ్రెయిన్ ఈ జాబితాలో పేర్లు ఉన్నాయి. పన్ను విధింపు నిర్ణయం చాలా కష్టం. ప్రభుత్వాలు తమ ఆర్థిక అవసరాలు, ఆర్థిక సిద్ధాంతాల ఆధారంగా ఈ వ్యవస్థను అమలు చేస్తాయి. పెద్ద చమురు నిల్వలు ఉన్న దేశాలు తమ పౌరులపై నేరుగా పన్ను విధించకుండా ఉండగలవు. ఈ దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను నిలబెట్టుకోవడానికి చమురు, గ్యాస్ ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాలపై ఆధారపడి ఉండవచ్చు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



# వరల్డ్ ర్యాపిడ్ చెస్ విజేత హంపి

న్యూయార్క్ : భారత స్టార్ చెస్ క్రీడాకారిణి, గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. టోర్నీలో 11 పాయింట్లకు గాను ఆమె 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకోవడంతో విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన 11వ రౌండ్‌లో హంపి.. ఇరెనె సుకందర్ (ఇండోనేషియా)ను ఓడించడంతో టైటిల్ నెగ్గింది. ఈ టోర్నీని గెలుచుకోవడం హంపికి ఇది రెండోసారి. 2019లో జార్జియాలో నిర్వహించిన టోర్నీలోనూ హంపి సత్తా చాటింది. తద్వారా వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను ఒకటి కంటే ఎక్కువసార్లు గెలిచిన ప్లేయర్లలో చైనా క్రీడాకారిణి జు వెంజున్ తర్వాతి స్థానంలో నిలిచింది.

తొలి గేమ్‌లో ఓడిపోయినప్పటికీ హంపి తర్వాత పుంజుకుని టైటిల్‌ను దక్కించుకుంది. భారత్ నుంచి ద్రోణవల్లి హారిక (8 పాయింట్లు) ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో రష్యాకు చెందిన 18 ఏండ్ల కుర్రాడు వోలోదర్ ముర్జిన్ టైటిల్ గెలిచాడు. 10 పాయింట్లతో అతడు చాంపియన్‌గా అవతరించాడు. ఆరంభంలో వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన యువ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఆఖర్లో తడబడి 9 పాయింట్లతో ఐదో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది.

## నాలుగో టెస్ట్‌లో ఓటమి.. ఓటమి..

*సంక్లిష్టంగా మారిన టీమిండియా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలు..*





బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టెస్ట్‌లో భారత జట్టు 184 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైంది. ఈ ఓటమితో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) ఫైనల్‌కు చేరాలన్న భారత జట్టు అవకాశాలపై దెబ్బ కొట్టింది. ఇప్పటికీ ఫైనల్ ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నా.. అంత తేలిగ్గా మాత్రం కుదరదు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (MCG)లో ఓటమి తర్వాత WTC పాయింట్ల పట్టికలో భారతదేశం మూడో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉన్నది. దక్షిణాఫ్రికా జట్టు పాకిస్థాన్‌ను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ప్రస్తుతం కేవలం రెండోస్థానం కోసం మాత్రమే పోరు కొనసాగనున్నది. ప్రస్తుతం ఫైనల్‌కు చేరేందుక ఆస్ట్రేలియా జట్టుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వరుసగా రెండుసార్లు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడిన టీమిండియాకు మూడోసారి ఫైనల్ ఆడే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. మెల్‌బోర్న్ టెస్టులో 340 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 155 పరుగులకు కుప్పకూలింది.

భారత బ్యాటర్లు మూడు సెషన్లలో ఆసిస్ బౌలర్లను దీటుగా ఎదుర్కోలేకపోయారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మెల్‌బోర్న్‌లో టీమిండియా టెస్టులో ఓడిపోయింది. ఇంతకు ముందు 2011లో చివరిసారిగా ఓడింది. ఈ విజయంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 21 ఆధిక్యంలో నిలిచింది. చివరి టెస్ట్ జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా జరుగనున్నది. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు టీమిండియా.. న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్ట్ సిరీస్ ఆడగా.. ఓటమిపాలైంది. పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియాను ఓడించిన భారత్, అడిలైడ్ టెస్టులో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. బ్రిస్బేన్ టెస్ట్ డ్రాగా ముగియగా.. మెల్‌బోర్న్ టెస్టులో ఓటమితో భారత్ 12 తేడాతో వెనుకంజలో ఉన్నది. ఈ క్రమంలో భారత్ ఇతర జట్ల ఫలితాలపైనే ఆధారపడాల్సి పరిస్థితి ఎదుర్కొంది.

## బాక్సింగ్ డే టెస్టు రికార్డు బ్రేక్..

### మ్యాచ్‌ను వీక్షించిన 3.73 లక్షల మంది ప్రేక్షకులు




**మెల్‌బోర్న్:** మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో కొత్త రికార్డు నమోదు అయ్యింది. అత్యధిక సంఖ్యలో ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన టెస్టు మ్యాచ్‌ను ప్రేక్షకులు వీక్షించారు. సుమారు 3,73,691 మంది మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించినట్లు రికార్డు నమోదైంది. బ్రాడ్‌మ్యాన్ కాలం నాటి రికార్డును ప్రేక్షకులు బ్రేక్ చేసినట్లు చెబుతున్నారు. ఎంసీజీలో ఇంత సంఖ్యలో ప్రేక్షకులు హాజరుకావడం ఇదే మొదటిసారి. ఇవాళ ఫైనల్ రోజు అత్యధికంగా 74,362 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించారు. దిగ్గజ బ్యాటర్ డాన్ బ్రాడ్‌మ్యాన్ కాలంలో కూడా ఈ స్థాయిలో ప్రేక్షకులు ఎంసీజీ చేరుకోలేదని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం అయిదు రోజుల్లో 373,691 మంది హాజరైనట్లు ఎంసీజీ అధికారులు తేల్చారు. ప్రతి రోజు రికార్డు స్థాయిలో ప్రేక్షకులు హాజరయ్యారు. ఆసక్తికరంగా సాగిన ఫైనల్ రోజు.. భారత్ చివరి సెషన్‌లో తడబడింది. ఆ సెషన్‌లో ఏడు వికెట్లును కోల్పోయింది. దీంతో ఇండియా 184 రన్స్ తేడాతో బాక్సింగ్ డే టెస్టులో ఓటమి చవిచూసింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా 21 తేడాతో ఆధిక్యంలో ఉన్నది. జనవరి 3వ తేదీ నుంచి అయిదవ టెస్టు మ్యాచ్ జరగనున్నది. 87 ఏళ్ల క్రితం బ్రాడ్‌మాన్ ఆడుతున్న రోజుల్లో భారీ సంఖ్యలో ఎంసీజీకి ప్రేక్షకులు వచ్చారు. 1937లో ఇంగ్లండ్‌తో ఆరు రోజుల పాటు జరిగిన టెస్టు మ్యాచ్‌ను రికార్డు స్థాయిలో వీక్షించారు. ఆ మ్యాచ్‌ను సుమారు 350534 మంది వీక్షించారు. ఇప్పుడు ఆ రికార్డును భారత్, ఆసీస్ మ్యాచ్ బ్రేక్ చేసింది.




# మానసిక వేదన మిగిల్చింది

## ఓటమిపై రోహిత్ శర్మ

**మెల్‌బోర్న్:** మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్టులో ఇండియా దారుణంగా ఓడింది. 184 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా ఆ టెస్టులో విజయం సాధించింది. ఆ మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియాతో కెప్టెన్ రోహిత్ శర్మ మట్లాడాడు. బాక్సింగ్ డే టెస్టులో ఓటమి మానసిక ఆందోళన కలిగించిందన్నాడు. అనుకున్నది చేయలేనప్పుడు మానసిక సంఘర్షణ ఉంటుందని రోహిత్ తెలిపాడు. ఈ సిరీస్‌లో రోహిత్ కూడా సరిగా ఆడలేకపోవడంతో అతనిపై కూడా విమర్శలు అధికమయ్యాయి.

ఆరు ఇన్నింగ్స్‌లో అతను కేవలం 31 రన్స్ మాత్రమే చేశాడు. ఓటమి డిస్టర్బింగ్‌గా ఉందని, వ్యక్తిగత లోపాలపై దృష్టి పెట్టాలన్నాడు. బాక్సింగ్ డే టెస్టు నిరాశపరిచిందని, మ్యాచ్‌లు గెలిచేందుకు మార్గాలు ఉంటాయని, కానీ ఆ మార్గాలను అన్వేషించలేకపోయామని రోహిత్ పేర్కొన్నాడు. చివర వరకు పోరాడాలని నిశ్చయించామని, కానీ దురదృష్టవశాత్తు అలా చేయలేకపోయినట్లు చెప్పాడు.

సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఓ దశలో 90 రన్స్‌కే ఆరు వికెట్లను కోల్పోయింది. కానీ ఆ తర్వాత చివరి వికెట్‌కు భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పిన ఆస్ట్రేలియా.. భారీ ఆధిక్యాన్ని కూడా నమోదు చేసింది. ఆ పరిస్థితులను సరిగా వినియోగించుకోలేకపోయినట్లు రోహిత్ తెలిపాడు. విపత్కర పరిస్థితుల్లో చాలా పటిష్టమైన ఆటను ఆడాలన్న ఉద్దేశంతో ఉన్నామని, కానీ అనుకున్న రీతిలో రాణించలేకపోయామన్నాడు. రూమ్‌కు వెళ్లిన తర్వాత ఎలా ఓ జట్టుగా పోరాడాలన్న ఆలోచన చేసినట్లు రోహిత్ చెప్పాడు. మా దగ్గర ఉన్నవన్నీ మేం ప్రయోగించాం, వాళ్లు కూడా తీవ్రంగా పోరాడారు, ఆ చివరి వికెట్ భాగస్వామ్యం మొత్తం మ్యాచ్‌ను మార్చేసిందన్నాడు.

టార్గెట్ కష్టమైందే అయినా.. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలన్న ఉద్దేశంతో ఆడినట్లు రోహిత్ తెలిపాడు. 340 అంత ఈజీగా కాదన్న విషయం తమకు తెలుసు అని, ముందుగా ఓ ఫ్లాట్‌ఫామ్‌ను సెట్ చేసి, చివరి రెండు సెషన్ల కోసం వికెట్లను కాపాడాలనుకున్నాం, కానీ వాళ్లు అద్భుతంగా బౌలింగ్ చేశారని, టార్గెట్ చేరుకునే స్థాయిలో ఆడలేకపోయినట్లు చెప్పాడు. తెలుగు బ్యాటర్ నితీశ్ కుమార్ రెడ్డిపై ప్రశంసలు కురిపించాడు రోహిత్. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన అతన్ని మెచ్చుకున్నాడు. బహుశా అతను భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి చేరుకుంటాడని ఆశిస్తున్నట్లు చెప్పాడు. ఆస్ట్రేలియాకు అతను రావడం ఫస్ట్ టైం అని, ఇలాంటి పరిస్థితులు చాలా టఫ్‌గా ఉంటాయని, కానీ అతను చాలా పరిణితి చూపించాడని, నితీశ్ టెక్నిక్ కూడా బాగుందన్నాడు. అతనికి జట్టు ఎప్పుడూ అండగా ఉంటుందని రోహిత్ తెలిపాడు. బౌలింగ్ యూనిట్‌ను ఒంటి చేతిలో నడిపిస్తున్న బుమ్రాను విశేషంగా మెచ్చుకున్నాడు రోహిత్. అతన్ని ఎన్నో ఏళ్ల నుంచి చూస్తున్నామని, బుమ్రా తన కర్తవ్యాన్ని ఈజీగా నిర్వర్తిస్తాడని, అతనేమీ గణాంకాల వ్యక్తి కాదు అని పేర్కొన్నాడు. దేశం కోసం ఆడుతాడని, జట్టు కోసం మంచే చేస్తాడన్నాడు. కానీ జట్టులోని ఇతర బౌలర్ల నుంచి అతనికి సరైన సపోర్టు దక్కలేదన్నాడు.





## హర్యానాదే ట్రోఫీ

**పీకేఎల్ ఫైనల్‌లో పాట్నా పైరేట్స్‌పై గెలుపు**

**పూణె:** ప్రో కబడ్డీ లీగ్ 11వ సీజన్ టైటిల్‌ను హర్యానా స్టీలర్స్ దక్కించుకుంది. సీజన్ ఆరంభం నుంచి టేబుల్ టాపర్‌గా ఉంటూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఫైనల్ చేరిన ఆ జట్టు.. టైటిల్ పోరులో 3223తో పాట్నా పైరేట్స్‌ను మట్టి కరిపించి ఈ టోర్నీలో తొలిసారి ట్రోఫీని సాధించింది. గతేడాది ఫైనల్‌లో పూణెరి పల్టన్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన హర్యానా ఈసారి మాత్రం పట్టు విడవకుండా టోర్నీ ఆసాంతం అదరగొట్టి తమ కప్ కలను సొంతం చేసుకుంది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి 1512తో ఆధిక్యంలో ఉన్న హర్యానా.. సెకండాఫ్‌లో మరింత జోరు పెంచింది. హర్యానా తరపున రైడర్ శివమ్ పటారె 9 పాయింట్లతో సత్తా చాటగా ఆల్‌రౌండర్ షాద్లోయ్ (7), వినయ్ (6) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

# గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చీఫ్ గెస్ట్‌గా ఏపీ డిప్యూటీ సీఎం..!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. రామ్ చరణ్ - శంకర్ - దిల్ రాజు కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ప్రీ రిలీజ్ వేడుకను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించబోతున్న విషయం తెలిసిందే. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను టీం ఇన్వైట్ చేయనున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే ఇదే విషయంపై నిర్మాత దిల్ రాజు నేడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో మంగళగిరి జనసేన కార్యాలయంలో భేటీ అయ్యాడు. దిల్ రాజు గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చీఫ్ గెస్ట్‌గా పవన్ రావాలని దిల్ రాజు కోరడంతో జనసేనాని ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. ఇక ఈ ప్రీ రిలీజ్ వేడుకను జనవరి 04న రాజమండ్రిలో నిర్వహించబోతున్నట్లు సమాచారం.



# 2024 ఐఎండీబీ మోస్ట్ పాపులర్ సినిమాగా ప్రభాస్ కల్కి..



## కల్కి 2898 ఏడీ

ప్రముఖ ఎంటర్‌టైన్మెంట్ పోర్టల్ ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ (IMDb) ప్రతి సంవత్సరం దేశంలోని సినిమాల క్రేజ్ గురించి సర్వే నిర్వహించి.. మోస్ట్ పాపులర్ విభాగంలో టాప్ పొజిషన్‌లో ఉన్న సినిమాల జాబితాలను విడుదల చేస్తుందన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ఏడాది మోస్ట్ పాపులర్‌గా నిలిచిన సినిమాల జాబితాను ఐఎండీబీ విడుదల చేసింది. ఈ జాబితాలో ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ చిత్రం అగ్ర స్థానంలో ఉండగా.. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ అందుకున్న 'స్త్రీ 2' రెండో స్థానంలో నిలిచింది. ఇక టాప్ టెన్‌లో ఉన్న సినిమాలు ఒకసారి చూసుకుంటే.!

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడీ' (Kalki 2898 AD). ది గ్రేట్ లెజెండ్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, హీరోయిన్ దీపిక పదుకొనే వంటి గొప్ప యాక్టర్స్ నటించిన ఈ చిత్రం జూన్ 27 న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకొవడమే కాకుండా.. రూ.1300 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం 2024 ఐఎండీబీ మోస్ట్ పాపులర్ సినిమా విభాగంలో టాప్ పోజిషన్‌లో నిలిచింది.



## స్త్రీ 2

కల్కి చిత్రం తర్వాత ఈ ఏడాది మోస్ట్ పాపులర్‌గా నిలిచిన చిత్రం 'స్త్రీ 2'. బాలీవుడ్ నటులు రాజ్ కుమార్ రావు, శ్రద్ధా కపూర్, పంకజ్ త్రిపాఠీ ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమాకు అమర్ కౌశిక్ దర్శకత్వం వహించాడు. ఐదేళ్ల కిందట బాలీవుడ్‌లో వచ్చిన 'స్త్రీ' సినిమాకు ఈ చిత్రం సీక్వెల్‌గా వచ్చింది. ఇండిపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.880 కోట్ల వసుళ్లను రాబట్టింది. అయితే ఈ చిత్రం 2024 ఐఎండీబీ మోస్ట్ పాపులర్ సినిమా విభాగంలో రెండో స్థానంలో నిలిచింది.

# ఘాటీలో ఘాటైన పాత్ర



కెరీర్ బిగినింగ్‌లో గ్లామర్ పాత్రల్లో ఓ వెలుగు వెలిగింది అనుష్క. అయితే.. 'అరుంధతి' తర్వాత ఆమె నుంచి రెగ్యులర్ గ్లామర్ పాత్రలు కాకుండా, అభినయానికి ఆస్కారమున్న పాత్రల్నే ఆడియన్స్ ఆశించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆమె చేసిన వేదం, బాహుబలి ఫ్రాంచైజీ, రుద్రమదేవి, సైజ్ జీరో, భాగమతి, నిశ్శబ్దం, మిస్ శెట్టి - మిస్టర్ పోలిశెట్టి సినిమాలు ఆమెను నటిగా గౌరవప్రదమైన స్థానంలో కూర్చోబెట్టాయి. ఆ వరుసలో ఆమె చేస్తున్న మరో వైవిధ్యమైన సినిమానే 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఉత్తరాంధ్ర గంజాయి తోటల నేపథ్యంలో సాగే విభిన్న కథాచిత్రమని తెలుస్తున్నది. ఇందులో అనుష్క పాత్ర ఊహలకు అతీతంగా ఉంటుందని సమాచారం. ఇటీవల విడుదలైన టీజర్‌లో.. అనుష్క బస్‌లో ఓ వ్యక్తిని మర్డర్ చేసే సన్నివేశం సినిమాపై అంచనాలు పెంచేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. క్లైమాక్స్ షూట్ మాత్రమే మిగిలివుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా నడుస్తున్నది. జనవరి చివరివారం నుంచి క్లైమాక్స్ షూట్ ఉంటుందని తెలుస్తున్నది. ఏప్రిల్ 18న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు సంభాషణలు అందిస్తున్న విషయం తెలిసిందే.

# చెంచుల యువరాణిగా ప్రీతి ముకుందన్..

ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో ప్రీతి కన్నప్ప ఇష్టసఖి, చెంచుల యువరాణి నెమలి పాత్రలో నటిస్తుంది."అందంలో సహజం.. తెగింపులో సాహసం.. ప్రేమలో అసాధారణం.. భక్తిలో పారవశ్యం.. కన్నప్పకి సర్వస్వం చెంచుల యువరాణి నెమలి అంటూ" ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను పంచుకుంది.

# ఆమెతో పనిచేస్తే.. మాయలో పడిపోవాల్సిందే..

## అలియాపై జిగ్రా దర్శకుడి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

'అలియాభట్ ఓ మాయ.. ఒక్కసారి ఆమెతో పనిచేస్తే ఆ మాయలో ఎవరైనా పడిపోవాల్సిందే. ఆమె ఆరా మనల్ని కూడా కమ్మేస్తుంది.' అంటున్నారు దర్శకుడు వాసన్‌బాల. ఇటీవలే అలియాతో ఆయన 'జిగ్రా' సినిమా తెరకెక్కించారు. ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా.. అలియాతో పనిచేశానన్న తృప్తి మాత్రం 'జిగ్రా' వల్ల లభించిందని ఆయన అన్నారు. ' 'జిగ్రా' సీరియస్ సబ్జెక్ట్. ఆ కథలో కామెడీ లేదు. కానీ సెట్ అంతా ఎప్పుడు కామెడీగా ఉండేది. కారణం అలియాభట్. తను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఓ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేయడం అలియా స్పెషాలిటీ. ఆమెతో ఒక్కసారి పనిచేశాక.. మళ్లీ ఇంకొకరితో పనిచేయడం చాలా కష్టం. ఎందుకంటే తనే గుర్తుకొస్తుంటుంది..' అంటూ మాట్లాడారు వాసన్‌బాలా. దీనిబట్టి అలియా మాయ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థంచేసుకోవచ్చు.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com